
Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారం


అభినందనలు అయినా..
సంతాపం అయినా..
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారం
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 163 విశాఖపట్నం, 9 ఏప్రిల్ 2025 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




## పీ-4 అమలుకు రాష్ట్రస్థాయి సొసైటీ

• సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

**అమరావతి, విశాఖ సమాచారం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమాన్ని విస్తృతం చేసేందుకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. సీఎం ఛైర్మన్‌గా రాష్ట్రస్థాయి సొసైటీ ఏర్పాటుకు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. జీరో పావర్టీ, పీ-4పై నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మార్గదర్శులను కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తించేలా వ్యవస్థను రూపొందించనున్నట్లు సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు. పీ-4 కోసం మిలాప్, డొనేట్ కార్ట్, రంగ్ దే సంస్థల ...(మిగతా 2లో)



## వాలంటీర్లవి అనధికార నియామకాలు

• వారికి సంబంధించి ఎలాంటి అధికారిక జీవోలు లేవు
• అందుకే కూటమి ప్రభుత్వంలో కొనసాగించలేకపోయాం
• ఏజెన్సీ ప్రాంతంలో ఉమ్మడి సేంద్రీయ వ్యవసాయం పెరగాలి
• కేరళ తరహా పర్యాటకం అవసరం
• కురిడి రచ్చబండ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**దుంబ్రిగుడ, విశాఖ సమాచారం:** వలంటీర్లను ఆదుకునే విషయంలో సరైన దారి వెతుకుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కురుడి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు చెప్పిన సమస్యలు అసాంతం విన్నారు. వాటిని రాసుకున్నారు. అనంతరం సమస్యలపై అధికారులకు తగు సూచనలు చేసి పరిష్కార మార్గాలు వెతకాలని చెప్పారు. ఈ సందర్భంగా కొందరు యువత వలంటీర్ల సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'వలంటీర్ అనే పేరును వైసీపీ ప్రభుత్వం అతి తెలివితో పెట్టింది. వలంటీర్ అంటే స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు వచ్చిన వారు అని అర్థం. కానీ ప్రచారం మాత్రం ప్రభుత్వ ఉద్యోగమని మభ్యపెట్టి యువతను మోసం చేశారు. యువతను ...(మిగతా 2లో)



## భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు 71 శాతం పూర్తి

• అనుకున్న సమయానికన్నా ముందే నిర్మాణం
• వచ్చే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి
• పనులు పరిశీలించిన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**విజయనగరం, విశాఖ సమాచారం:** భోగాపురం ఎయిర్‌పోర్ట్ ను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేస్తామని ముందుగా అనుకున్నప్పటికీ గత 6 నెలలుగా పనుల వేగాన్ని పెంచడంతో అనుకున్న కన్నా ముందే పనులు పూర్తి చేసుకొని జూన్ 2026 నాటికే ప్రారంభిస్తామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నవంబర్ లో ఓవరాల్ గా 49 శాతంగా ఉన్న పనులు నేడు 71 శాతానికి పెరిగిందని, ఎర్త్ వర్క్ పూర్తి అయిందని తెలిపారు. రన్ వే 97 శాతం, టాక్సీ వే 92 శాతం, టెర్మినల్ బిల్డింగ్ 60 శాతం, ఏటీసీ టవర్ - 72 శాతం, యాన్సిలరీ భవనాలు - 43 శాతం , మెయిన్ అప్రోచ్ రహదారుల ...(మిగతా 2లో)

## బాబుకు ఊడిగం చేసేవారికి శిక్ష తప్పదు



పోలీసులకు వైఎస్ జగన్ హెచ్చరిక

**సత్యసాయి జిల్లా, విశాఖ సమాచారం:** ఏపీలో ప్రభుత్వం, పోలీసులు కలిసి చేస్తున్న నేరాలు స్పష్టంగా కనిపిస్తున్నా యని.. లింగమయ్య ఘటనే అందుకు ఉదాహరణ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. పాపిరెడ్డిపల్లిలో ఫ్యాక్షన్ రాజకీయానికి బల్కైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "పిన్నెల్లి రామకృష్ణపై కుట్రపూరితంగా కేసులు పెట్టి వేధించారు. పోసాని కృష్ణ మురళిపై 18 అక్రమ ...(మిగతా 2లో)

## 15 నుంచి ఏపీలో ఇంటింటికీ 'మన మిత్ర'




**అమరావతి, విశాఖ సమాచారం:** ఇంటింటికీ 'మనమిత్ర' కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. వాట్సప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 95523-00009 నంబర్‌ను సచివాలయ సిబ్బంది సేవ్ చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రం, వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తద్వారా ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకునేలా ఐటీ, రియల్ టైం గవర్నెన్స్ శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 250కి పైగా సేవలందిస్తోంది. జూన్ నెలకు 500కు పైగా సేవలందించే దిశగా చర్యలు ...(మిగతా 2లో)

## సింగపూర్ స్కూల్లో అగ్నిప్రమాదం

• పవన్ చిన్న కుమారుడికి గాయాలు


అగ్ని ప్రమాదం జరిగిన స్కూల్ ఇదే

**అమరావతి, విశాఖ సమాచారం :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ అగ్నిప్రమాదంలో గాయపడ్డాడు. సింగపూర్‌లో అతను చదువుతున్న స్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అతని చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈవిషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ సింగపూర్ వెళ్లనున్నారు. సింగపూర్‌లోని రివర్ వ్యాలీ షాప్‌హౌస్‌లో మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ భవనంలో చిన్నారులకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. రెండు, మూడు అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. సమాచారం ...(మిగతా 2లో)




## ఏపీలో రూ.80 వేల కోట్లతో రిఫైనరీ

• కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి

**పారాదీప్ :** పెట్రోలియం రంగంలో అనేక రాష్ట్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయనీ.. అవకాశాలు వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఏపీలో రూ.80 వేల కోట్లతో రిఫైనరీ రాబోతోందని వెల్లడించారు. ఒడిశా పారాదీప్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీ ఏర్పాటు చేస్తోంది. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఒడిశా ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో హర్దీప్ సింగ్ పురి పాల్గొన్నారు. "గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునే వాళ్లం. ...(మిగతా 2లో)

## కన్నుల పండువగా అప్పన్న కల్యాణోత్సవం



**సింహాచలం, విశాఖ సమాచారం:** చైత్ర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వేంజేసిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచే కల్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం విశేష హోమాలు జరిగాయి. మధ్యాహ్నం పసుపు దంచి కొట్నాల ఉత్సవం చేశారు. సాయంత్రం గ్రామ బలిహరణం, ధ్వజారోహణం, ఎదుర్కోలు, రథోత్సవం అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. సింహాచలేశుని కల్యాణానికి ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబం పట్టువస్త్రాలు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. ఈనేపథ్యంలో అశోకగజపతిరాజు రథం పై ఉభయ దేవేరులతో కొలువుతీరివున్న వరాహ నారసింహుడి దర్శనం చేసుకుని అనంతరం పట్టువస్త్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేలు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కాగా, కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఈఓ కె.సుబ్బారావు అధికారులకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం విభాగాది పతులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. కల్యాణానికి హాజరయ్యే ప్రముఖులకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.





## విద్యార్థుల ఆలస్యానికి పవన్ కాన్వాయ్ కారణం కాదు

• విశాఖ సీపీ స్పష్టీకరణ

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాన్వాయ్ కారణంగా జేఈఈ (మెయిన్) పరీక్షలకు హాజరు కాలేకపోయామంటూ పెందుర్తిలో కొందరు విద్యార్థులు చేసిన ఆరోపణలపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్పందించారు. పవన్ కాన్వాయ్ వల్ల విద్యార్థులకు ఆలస్యమైందనడం అవాస్తవమన్నారు. "డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు పెట్టలేదు. విద్యార్థులు, ...(మిగతా 2లో)

# వటపత్రశాయి అలంకరణలో కోదండ రాముడు





**ఒంటిమిట్ట, విశాఖ సమాచారం:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. జలప్రళయం సంభవించినపుడు శ్రీమహావిష్ణువు మర్రి ఆకుపై తేలియాడుతూ చిన్న శిశువుగా దర్శనమిస్తారు. కుడికాలి బొటనవేలిని నోటిలో పెట్టుకుని ఆస్వాదిస్తుంటారు. ఈ ఘట్టాన్ని గుర్తుచేస్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు భక్తులకు కనువిందు చేశారు. భక్తుల కష్టాలను కడతేర్చేందుకు ఎప్పుడూ ముందుంటానని స్వామివారు ఈ అలంకారం ద్వారా తెలియజేస్తున్నారు. వట పత్రశాయి మహిమను అన్నమయ్య తన సంకీర్తనల్లో చక్కగా వర్ణించారు. వాహనసేవలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ నుంచి విడిపోయిన బోగీలు



**పలాస, విశాఖ సమాచారం:** శ్రీకాకుళం జిల్లా పలాసలో ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి బోగీలు విడిపోయాయి. సికింద్రాబాద్ నుంచి హౌవ్‌డా వెళ్తుండగా పలాస పట్టణ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏ1 ఏసీ బోగీ వద్ద కప్లింగ్ దెబ్బతినడంతో 15 బోగీలు విడిపోయాయి. ఆ బోగీలను అమర్చేందుకు సిబ్బంది చర్యలు చేట్టారు. 15 బోగీలను రెండు ఇంజిన్లతో మందస రోడ్‌కు తరలించారు. అక్కడ మరమ్మతులు చేసిన అనంతరం రైలు తిరిగి బయల్దేరింది. దీంతో గంటకు పైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# 16న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

## -జడ్పీ సీఈవో నారాయణమూర్తి

**విశాఖపట్నం(విశాఖ సమా చారమ్):** జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 16వ తేదీన ఛైర్‌పర్సన్ అధ్యక్షతన స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం 16వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొన సాగుతుందని సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

# బాబుకు ఊడిగం చేసేవారికి శిక్ష తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు బనాయించి తీవ్రంగా వేధించారు. నందిగం సురేష్‌పై తప్పుడు కేసులు పెట్టి 145 రోజులు జైల్లో ఉంచారు. ఇవన్నీ ప్రభుత్వం, పోలీసులు కలిసి చేస్తున్న నేరాలే... చంద్రబాబు మంచి అనేది నేర్చుకోవాలి. సూపర్ సిక్స్ హామీలపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు దౌర్జన్యకాండకు ప్రజలే బుద్ధి చెప్తారు. బాబు మెప్పుకోసం కొందరు పోలీసులు పని చేస్తున్నారు. టోపీలపై ఉన్న సింహాలకు సెల్యూట్ చేయకుండా బాబుకు వాచ్‌మెన్‌లా పని చేస్తున్న పోలీసులకు చెబుతున్నా. ఎల్లకాలం చంద్రబాబు పాలన కొనసాగదు. తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టం. బాబుకు ఊడిగం చేసేవారికి శిక్ష తప్పదు. యూనిఫాం తీయించి చట్టం ముందు నిలబెడతాం" అని వైఎస్ జగన్ ఘాటుగా హెచ్చరించారు.

**ఏపీలో శాంతి భద్రతలు లేవు**

ఏపీలో పరిస్థితులు పూర్వపు బీహార్‌ను తలపిస్తున్నాయని వైఎస్ జగన్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రతిఒక్కరూ ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "లింగమయ్య హత్యతో? పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, శాంతి భద్రతలు దిగజారాయి.



చంద్రబాబు ఎంత భయపెట్టినా, ప్రలోభాలు పెట్టిన ఎంపీపీ ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అడుగడుగునా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. చంద్రబాబుకు బలం లేదని స్థానిక ఎన్నికలను అడ్డుకున్నారు. 50 చోట్ల ఎన్నికలు జరిగితే 39 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలిచింది. చంద్రబాబుకు అనుకూలంగా లేదని 7 చోట్ల వాయిదా వేయించారు. టీడీపీ ఎమ్మెల్యే, తనయుడు, రామగిరి ఎస్ఐ దౌర్జన్యాలు చేశారు. లింగమయ్య హత్య కేసును నీరుగార్చుతున్నారు. లింగమయ్య హత్యపై కంప్లైంట్ వాళ్లే రాసుకొచ్చారు. లింగమయ్య భార్యతో బలవంతంగా వేలిముద్రలు వేయించారు. లింగమయ్య కొడుకు ఫిర్యాదును పక్కన పెట్టారు. తమకు అనుకూలమైన వారినే సాక్షులుగా పెట్టారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లోనూ దౌర్జన్యాలు చేశారు. ఏకంగా పోలీసుల ఆధ్వర్యంలో కూటమి నేతలు కిడ్నాలు చేశారు. రామకుప్పం ఎంపీపీ ఎన్నికల్లో కూడా దౌర్జన్యం చేశారు" వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

# పీ-4 అమలుకు రాష్ట్రస్థాయి సొసైటీ

(మొదటి పేజీ తరువాయి)

సహకారం తీసుకోవాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు.

**నేడు అమరావతిలో సీఎం చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన**

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో తన సొంతింటి నిర్మాణానికి సీఎం చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 8. 51 గంటలకు సీఎం కుటుంబ సభ్యులు భూమి పూజ చేస్తారు. వెలగపూడి సచివాలయం వెనక ఈ 9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపడతారు. ఈ సందర్భంగా సీఎం కుటుంబానికి వెలగపూడి గ్రామస్తులు పట్టు వస్త్రాలు అందించనున్నారు. రాజధానిలో సొంత ఇంటి నిర్మాణం కోసం చంద్రబాబు రైతుల నుంచి ఐదు ఎకరాల భూమి కొనుగోలు చేశారు.

# ఏపీలో రూ.80 వేల కోట్లతో రిఫైనరీ

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు 40 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కొనుగోలు చేసి.. ఎక్కువ నిల్వ చేస్తాం. ప్రస్తుతం ఒక్కో బ్యారల్ ముడి చమురు 60 డాలర్ల వరకు ఉంది" అని కేంద్ర మంత్రి తెలిపారు.

# 15 నుంచి ఏపీలో ఇంటింటికీ 'మన మిత్ర'

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. తదుపరి దశలో 1000కిపైగా సేవల కల్పించాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా అధికారులు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అందుబాటులోకి తెచ్చారు. మనమిత్ర ఇప్పటికే ప్రజాభిమానం చూరగొంటుందని అధికారులు తెలిపారు. నిరక్షరాస్యుల కోసం వాయిస్ మెసేజ్ ద్వారా పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఏర్పాటు చేశారు. పౌరులందరూ తమ మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# సింగపూర్ స్కూల్లో అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందుకున్న సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. భవనం లోపల చిక్కుకున్న వారిని రక్షించి రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో 15 మంది చిన్నారులు సహా 19 మంది గాయపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అందులో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు సింగపూర్ మీడియా కథనాలు వెల్లడిరచాయి. పవన్ కుమారుడు మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో అస్వస్థతకు గురయ్యాడు.

ప్రస్తుతం పవన్ అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్నారు. కార్యక్రమాలను రద్దు చేసుకొని సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు ఆయనకు సూచించారు. ఇచ్చినమాట ప్రకారం గిరిజనులను కలిసి వెళ్తానని పవన్ చెప్పారు. ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసి వెళ్తానన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పవన్ సింగపూర్ వెళ్లనున్నారు.

**త్వరగా కోలుకోవాలి: చంద్రబాబు, లోకేశ్**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కుమారుడి ప్రమాద సమాచారం అందుకున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విట్టర్ ద్వారా స్పందించారు. సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న శంకర్ త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించారు. "ఆ వార్త విని షాక్‌కు గురయ్యా. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి. క్లిష్ట సమయంలో పవన్ కుటుంబం ధైర్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను" అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**వైఎస్ జగన్ దిగ్భ్రాంతి**

అగ్ని ప్రమాదంలో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు శంకర్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు.

**పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్.. కుమారుడి ఆరోగ్యంపై ఆరా**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. పవన్‌కు ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు 71 శాతం పూర్తి




(మొదటి పేజీ తరువాయి)

పనులు 37 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. మంగళవారం మంత్రి రాం మోహన్ నాయుడు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులను పరిశీలించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 26శాతంగా ఉన్న విమానాశ్రయం నిర్మాణం పనులు నేడు 71 శాతానికి చేరుకున్నాయని తెలిపారు. దేశంలో అతి అధునాతన ఎయిర్ పోర్టులైన ముంబాయి , నోయిడా, భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణంతో దేశం రూపు రేఖలు మారనున్నాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటుపై సర్వత్రా ఆసక్తి నెలకొందని, భవిష్యత్ లో అన్ని రకాల సదుపాయాలతో ఈ విమానాశ్రయం నిర్మిస్తున్నామని తెలిపారు. దేశంలో అతి పెద్ద రన్ వే 3.8 కిలోమీటర్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. స్థానికంగానే స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎయిర్పోర్ట్ , ఇతర ఎకనామిక్ కార్యక్రమాలను, వ్యాపార అభివృద్ధికి అవసరమయ్యే శిక్షణలను ఇస్తామని, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎయిర్పోర్ట్ ప్రారంభం అయ్యే నాటికి తాజ్ గ్రూప్ హెూటల్ కూడా ప్రారంభం అయ్యేలా చూస్తామన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా విమానాశ్రయం లోపల ఇంటీరియర్ డిజైన్ చేపడుతున్నట్లు తెలిపారు. విశాఖ ట్రాఫిక్ ను ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకున్నమని, వైజాగ్ పోర్ట్ నుండి మూల పేట పోర్ట్ వరకు కనెక్టివిటీ కోసం కొత్త డి.పి.ఆర్ లను తయారు చేస్తామన్నారు. తీర ప్రాంత అభివృద్ధి, పర్య టకాభివృద్ధికి అవకాశం ఉండేలా చూస్తా మన్నారు. అనకాపల్లి, ఆనందపురం బై పాస్ రహదారిని భోగాపురం విమానాశ్రయానికి సరైన విధంగా కనెక్ట్ చేస్తామని తెలిపారు. నిర్వాసితుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, భూములిచ్చిన రైతులు నష్టపోకుండా చూస్తామని, అలాగే సర్వీస్ రోడ్ సమస్య ను కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా ఎయిర్పోర్ట్ ఉంటుందని, ఉత్తరాంధ్ర ముఖ చిత్రం ఈ ఎయిర్పోర్ట్ మార్చుతుందని, ప్రస్తుతం జరుగుతున్న పనుల పట్ల సంతృప్తిగా ఉందని అన్నారు.

కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ , ఎన్.ఆర్ .ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్కుఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్, జిల్లా ఎస్.పి వకుల్ తదితరులు వకుల్ జిందాల్ , ఆర్.డి.ఓ కీర్తి, జి.ఎం. ఆర్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.ప్రభాకర్ రావు , సి.ఈ.ఓ కన్వర్ బి సింగ్ కల్ర , మేనేజర్ రామరాజు, సి.డి.ఓ ఎం.కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆలస్యానికి పవన్ కాన్వాయ్ కారణం కాదు

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. విద్యార్థులే ఆలస్యంగా వచ్చి పోలీసులపై నిందలు వేస్తున్నారు. సీసీ ఫుటేజ్, ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల సెల్‌ఫోన్‌లను ట్రాక్ చేశాం. పోలీసుల వల్ల విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లాకే డిప్యూటీ సీఎం కాన్వాయ్ వెళ్లింది" అని సీపీ వివరించారు.

మరోవైపు, తన కాన్వాయ్ కారణంగా పెందుర్తిలో విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరవలేకపోయారనే వార్తలపై విచారణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాన్వాయ్ కోసం ఎంతసేపు ట్రాఫిక్‌ను నిలిపారు? పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులు వెళ్లే సమయంలో ఆ మార్గంలో ట్రాఫిక్ పరిస్థితేంటి? సర్వీసు రోడ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించారా? వంటి అంశాలపై విచారించాల్సిందిగా విశాఖ పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ తాజాగా ఈ వివరాలను వెల్లడించారు.

# వారంటీర్లవి అనధికార నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా వంచించి వైసీపీ పబ్బం గడుపుకొంది. వలంటీర్లకు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా వేతనాలు పెంచడంపై మొదటి క్యాబినెట్ సమావేశంలోనే చర్చించాం. అయితే వారికి సంబంధించి గత ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి జీవోలు ఇవ్వలేదు. సరైన ఉత్తర్వు పత్రాలను, జీతభత్యాలను లేకుండానే వారిని నియమించింది. గౌరవ వేతనాలు విచిత్రంగా ఎక్కడ నుంచి అందించిందో కూడా తెలియని పరిస్థితి కనిపించింది. నేను ఈ విషయంపై చర్చకు తీసుకురాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పరిశీలన చేసి వలంటీర్లకు సంబంధించి ఎలాంటి అధికారిక నియామకాలు జరగలేదని గుర్తించారు. ఉద్యోగాల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం వారిని నిలువునా వంచించిందని " అని ఉప ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు.

**రూ. వెయ్యి కోట్ల ఖర్చుతో రోడ్ల నిర్మాణం**

"కూటమి ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న జిల్లాల్లో రూ. వెయ్యి కోట్ల ఖర్చుతో రోడ్లను నిర్మిస్తోంది. ప్రస్తుతం రూ. 400 కోట్లు ఖర్చు చేశాం. మరో రెండు మూడు నెలల్లో రూ. 600 కోట్లు రోడ్ల నిర్మాణం నిమిత్తం ఖర్చు చేయబోతున్నాం. వైసీపీ తన ఐదేళ్ల పాలన కాలంలో ఏజెన్సీ ప్రాంతంలో కనీసం వంద కిలోమీటర్ల రోడ్లను వేయలేకపోయింది. మొత్తం వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దడానికే సమయం సరిపోతోంది. నాకు తెలిసినంత వరకు మద్యంలో రూ. 25 వేల కోట్ల అవినీతి జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఆరోపించారు.

**పోషకాహార లోపంపై దృష్టి**

ఏజెన్సీ గ్రామాల్లో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి బాధితులు అధికంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. జన్యు లోపాలు, ఇతర కారణాలతో పుట్టే పిల్లలకు పోషకాహార లోపం ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిని అధిగమించడానికి దృష్టి సారిస్తాం. మెరుగైన పోషక పదార్థాలు పిల్లలకు అందించేందుకు అంగన్వాడీలతో అనుసంధానం చేసి ప్రత్యేక పోషక పదార్థాలు అందేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడతాను. పాడేరులో కూడా గర్భిణులకు సంబంధించి ఆసుపత్రిలో సరైన వసతులు లేవని నా దృష్టికి వచ్చింది. స్కానింగ్ పనిచేయడం లేదని, రేడియోలజిస్ట్ లేరని తెలిసింది. దీనిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాను.

**ఉమ్మడి వ్యవసాయంపై దృష్టి**

ఉద్యోగ అవకాశాలు కావాలని యువత కోరుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించింది. పనిచేయాలన్న



బలమైన తపన ఉన్న వారికి సరైన ఉపాధి, ఉద్యోగం చూపించాలన్నది కూటమి ప్రభుత్వ ధ్యేయం. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉమ్మడి వ్యవసాయం మెరుగైన ఫలితాలు ఇస్తుంది. ఇక్కడ ఉండే భూమిని ఉపయోగించుకొని సేంద్రియ వ్యవసాయం చేస్తే మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. కురిడి గ్రామంలో 400 ఎకరాలకుపైగా భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాంటి భూమిలో ఔషధ మొక్కలు, పండ్లు, పూల పంటలు వేస్తే అధికంగా ఆదాయం వస్తుంది.

**కురిడి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేద్దాం**

ఏజెన్సీలో 2.5 లక్షల ఎకరాల భూమిలో కాఫీ పంట వేస్తున్నామన్నారు. మరో లక్ష ఎకరాల కాఫీ పంట సాగు చేసేందుకు జిల్లా కలెక్టర్ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అనుమతి కల్పించాలని కోరారు. మొదటగా కురిడి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేసి ప్రయోగాత్మకంగా ఉమ్మడి సాగు గ్రామంగా తీర్చిదిద్దుదాం. మీరు వేసే పంటలు మార్కెట్ కు వెళ్లేలా విశాఖపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. కురిడి గ్రామం నా ప్రస్థానానికి దారి చూపించిన గ్రామం. కాబట్టే గుర్తుపెట్టుకొని ఇక్కడికి వచ్చాను. కురిడి గ్రామ అభివృద్ధికి నా సొంత నిధుల నుంచి రూ. 5 లక్షలు ప్రకటిస్తున్నాను.

**సాంస్కృతిక పర్యాటకం పెంచుదాం**

సినిమా, టీవీ సీరియల్స్ రూపొందించే వారికి ఉపయోగపడేలా వసతులు ఏర్పాటు చేయాలి. హెూం స్టేలను ఏర్పాటు చేసుకోండి. దీనివల్ల ఆదాయం, అభివృద్ధి రెండూ జరుగుతాయి. సినిమా షుటింగ్ ల సమయంలో స్థానికులకు ఉపాధి దొరుకుతుంది. టూరిజం శాఖ నుంచి పక్కా ప్రణాళికతో ఇక్కడ అభివృద్ధి, షుటింగులు పెంచేలా చర్యలు తీసుకుంటాం. స్థానికంగా ఉండే భాషలు, సంప్రదాయాలు విరాజిల్లేలా పర్యటకం అభివృద్ధి చెందాలి. పర్యటకం అభివృద్ధి చెందే సమయంలో ప్రకృతికి ఏ మాత్రం విఘాతం కలగకూడదు. ప్రకృతి అందాలు మరింత పెంచేలా నిర్మాణాలు ఉండాలి. కేరళ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల్లో జరిగే ప్రత్యేక గ్రామ దేవతల ఉత్సవాలకు విదేశాల నుంచి కూడా పర్యాటకులు తరలి వస్తుంటారు. వారి సంస్కృతిని ప్రతిబింబిస్తూ నమ్మిన దేవతలకు మనస్ఫూర్తిగా ఉత్సవం చేసే కార్యక్రమాన్ని అంతా కలిసి పండగలా చేస్తారు. అలాంటి సాంస్కృతిక టూరిజం మన



ఏజెన్సీ ప్రాంతంలోనూ రావాలి. కుల ధ్రువీకరణ పత్రాలు కోసం చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని నా దృష్టికి వచ్చింది. ఈ రోజు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తాను" అని పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ ఎస్.దొన్ను దొర తదితరులు పాల్గొన్నారు.

**పవన్ ప్రత్యేక పూజలు**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండోరోజు పవన్ పర్యటన కొనసాగింది. డుంబ్రిగుడ మండలం కురిడిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి పవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనుల కోరిక మేరకు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం అక్కడ నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఉడెన్ బ్రిడ్జ్ ప్రారంభం**

ఎకో టూరిజం అభివృద్ధిలో అరకు మండలం, సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్స్ లో ఏర్పాటు చేసిన చెక్క వంతెనను ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రారంభించారు. కాఫీ తోటల మధ్య నిర్మించిన చెక్క వంతెనను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

# పన్ను వసూళ్లపై దృష్టిపెట్టండి

## పిజిఆర్ఎస్ వినతులు పెండింగ్ ఉండకూడదు
## జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. తహశీల్దార్లు, ఆర్ఎస్డిటిలు, మండల సర్వేయర్లతో కలెక్టరేట్ లో మంగళవారం రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపన్ను, పిజిఆర్ఎస్ గ్రీవెన్స్, 22ఏ పెండింగ్ ధరఖాస్తులు, రివెరిఫికేషన్ ఆఫ్ హౌస్ సైట్స్, రెగ్యులరైజేషన్ ఆఫ్ హౌస్ సైట్స్, హౌస్ సైట్స్ అసైన్మెంట్, ఫ్రీహోల్డ్ స్టేటస్, ఏపిసేవా సర్వీసెస్ , రిసర్వే రెండవ దశ పై మండలాల వారీగా తహశీల్దార్లతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చూడాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేవిధంగా పరిష్కరించాలని చెప్పారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను తప్పులు దొర్లకుండా, పకడ్బంధీగా నిర్వహించాలని అన్నారు.

రీసర్వే, అసైన్మెంట్, రెగ్యులరైజేషన్ ఆఫ్ హౌస్ సైట్స్ తదితర రెవెన్యూ అంశాలపై తహశీల్దార్లు, ఆర్ఎస్డిటిలు, ఎంపిక చేసిన విలేజ్ సర్వేయర్లు, విఆర్ఓలకు మధ్యాహ్నం వర్క్షాప్ నిర్వహించారు. సంబంధిత చట్టాలను, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికార్లు సత్యవాణి, రామ్మోహన్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం

## నివేదిక కోరిన చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు




**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ సామాజిక వర్గ దంపతుల వెట్టి చాకిరీ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర నివేదిక పంపాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు.

తమను వెట్టిచాకిరి చేయిస్తున్నారంటూ నంబూరు పద్మ, అగ్ని దంపతులు ఇచ్చిన ఫిర్యాదు పై స్పందించిన బాపట్ల కలెక్టర్ ను చైర్మన్ అభినందించారు.వెట్టిచాకిరి చేయించడంతో పాటు, దంపతులను అమ్మకానికి పెట్టడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కాలంలో కూడా వెట్టిచాకిరి చేయించేందుకు యత్నించడం దారుణమన్నారు.ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను బాపట్ల జిల్లా అధికారులు వెంటనే కమిషన్ కు సమర్పించాలని ఆదేశించారు.

# పట్టణ ఆరోగ్యం కేంద్రం సందర్శన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు మంగళవారం విద్యుత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి ఈ నెల ఆశా డే థీమ్ గర్భిణుల చెకప్-కాల్షియమ్ సప్లిమెంటేషన్, ఆసుపత్రిలో ప్రసవములు, మొదటి గంటలో తల్లిపాలు తాగించుట, గర్భిణుల ఆహారం, ఎం.సి.పి. కార్డ్స్, ఆశా యాప్, హెచ్.బి.వై.సి, హెచ్.బి.ఎన్.సి, వి.హెచ్.ఎన్.ఎస్. గురించి, ఆశా కార్యకర్తల యొక్క విధులు గురించి విపులంగా తెలియచేశారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్శనలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, నాగభూషణం, ఎం.పి.హెచ్.ఇ.ఓ. పాల్గొన్నారు.

# ఈనెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించాలి

## కలెక్టర్,జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నులను ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చునని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం 1955, సెక్షన్ 264 (3) అనుసరించి, ఆస్తి పన్ను డిమాండ్ నోటీసు సర్వీస్‌తో సంబంధం లేకుండా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను ఏప్రిల్ నెల 30వ తేదీలోగా చెల్లించిన యెడల 5 శాతం రాయితీని ఆస్తిపన్నుదారులు పొందవచ్చునని (ఎర్లీ బర్డ్ ఆఫర్), కావున మహా విశాఖపట్నం నగర ప్రజలు అందరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తి పన్నుల చెల్లింపులకు సంబంధించి ప్రజల సౌకర్యార్థం, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సౌకర్యం కేంద్రం, అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రాలు ఉదయం 9.00 ల నుండి సాయంత్రం 8.00 ల వరకు పని చేస్తాయన్నారు. ఆదివారం సెలవు దినములలో కూడా సౌకర్యం కేంద్రాలు పనిచేస్తాయని, కావున నగర ప్రజలు తమ దగ్గరలో గల జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి, నగర అభివృద్ధికి తోడ్పాటు అందించవలసినదిగా కలెక్టర్ కోరారు.

# కళారత్న ఉగాది పురస్కారాల పండుగ

## రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రైటర్స్ అకాడమీ, లీడర్ వార్తా పత్రిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన కళారత్న, ఉగాది అవార్డుల పురస్కారాలు-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో జరిగిన ఉగాది పురస్కారాల వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు పాల్గొని అవార్డులను పురస్కారాలను అందజేశారు. కళారత్న పురస్కారాలను మ్యాజిక్ విభాగంలో బి.ఎస్.రెడ్డికి, సంగీతం విభాగంలో ప్రొఫెసర్ కె.సరస్వతి విద్యార్థి, పాలగుమ్మి రాజగోపాల్ లకు కళావిమర్శ పెయింటింగ్ విభాగంలో సుంకర చలపతిరావుకి ముఖ్య అతిథి ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. అదే విధంగా ఉగాది పురస్కారాలను కల్చరల్ జర్నలిజం నృత్యం రంగాలలో ప్రతిభ చూపిన బి.ఆర్. విక్రమ్ కుమార్, సాహిత్యంలో శిరేల సన్యాసిరావు, డాక్టర్ బండి సత్యనారాయణ, సంగీతంలో గుంటుకు వెంకటరావు, నృత్యంలో ప్రతిభ కనబరిచిన డాక్టర్ ఆముక్త మాల్యద, నాటకం విభాగంలో టి. హేమ వెంకటేశ్వరి, చిరుధాన్యాలతో చిత్రాలు రూపొందించడంలో ప్రతిభ చూపిన మోకా విజయ్ కుమార్ లకు రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, ఎమ్మెల్యే గణబాబు సంయుక్తంగా అందజేశారు.

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం చేత ఉగాది పురస్కారాలు అందుకున్న వారిని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి రమణమూర్తి గుర్తించి సత్కరించడం అభినందనీయమని కొనియాడారు. పురస్కారాలు అందుకున్న వారు రాబోయే కాలంలో జాతీయస్థాయిలో అవార్డులు పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఒకప్పుడు పాలకులే కళలు సాహిత్యాలను ప్రోత్సహించే వారని, నేడు రైటర్స్ అకాడమీ ఆ బాధ్యత తీసుకుందని కొనియాడారు.



రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి మాట్లాడుతూ కళలు, సాహిత్యాన్ని ప్రోత్సహించడం కోసమే రైటర్స్ అకాడమీ సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, సాహితీవేత్తలకు బిరుదులు, ఉగాది పురస్కారాలు అందజేయడం తమ సంస్థ అదృష్టంగా భావిస్తుందన్నారు.

ష్ణదేవరాయలను అందరూ స్మరించుకుంటారని గుర్తు చేశారు. హాస్య అవధాని దుర్గాప్రసాద్ వాఖ్యాతగా వ్యవహరించిన పురస్కారాల సభలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి మేడ మస్తాన్ రెడ్డి, నాంచారయ్య, కళాకారులు సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాటర్ వరల్డ్‌లో బాలుడు మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** పోర్టు స్టేడియం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లోని వాటర్ వరల్డ్ లో బాలుడు మృతి చెందిన సంఘటన వెలుగుచూసింది. ఆ బాలుడు రిషి (7)గా గుర్తించారు.గుట్టు చప్పుడు కాకుండా బైక్‌పై ప్రైవేట్ ఆసుపత్రికి విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ సిబ్బంది తరలించారు.విషయం తెలుసుకొని ప్రైవేట్ బాలుడు తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు.అప్పటికే బాలుడు మృతి చెందినట్టు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు.పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించారు.బాలుడి మృతిపై బంధువులు ఆందోళనకు దిగారు.

### బాలుడు మృతిపై సీబీఐ విచారణ చేయాలి
### -ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు



పోర్టు స్టేడియం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్ లో బాలుడు మృతి జరిగిన దుర్ఘటన పైసీబీఐ విచారణ చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు డిమాండ్ చేశారు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్‌లో మృతి చెందిన బాలుడు బంధువులను ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కేజీహెచ్ మార్చురీ వద్ద పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కూడా ఈ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలు వచ్చాయన్నారు. పై ప్రమాద విషయాన్ని పోర్టు చైర్మన్ దృష్టికి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

# మాటల మనిషిని కాదు..చేతల మనిషిని

## ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు



**చోడవరం (విశాఖ సమాచారమ్):** చోడవరం నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి ఇప్పటికి 9 నెలలు పూర్తయిపోయిందని స్థానిక ఎమ్మెల్యే చేసింది ఏం కనబడటం లేదని విపక్షాలు, గిట్టని వాళ్ళు మాట్లాడుతున్నారని వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేకపోయినా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఒక ఎమ్మెల్యేగా తనకు ఉందని తాను చేతల మనిషినని, మాటల మనిషిని కానని తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం పూర్తవ్వగానే ఈ సంవత్సర కాలంలో ఎమ్మెల్యేగా చోడవరం నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చాను, ఏం అభివృద్ధి పనులు చేశానో.. మొత్తం ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను ప్రజల ముందు పెడతానని ఆ రోజున తాను ప్రజల మనిషినో కానో ప్రజలే నిర్ణయిస్తారని ఎమ్మెల్యే అన్నారు. విపక్షాలకి ఏం మాట్లాడాలో తెలియక ఉచిత బస్సు హామీ అవలేదు,సూపర్ సిక్స్ అమల్లోకి రాలేదు ఇలా నోటికి వచ్చిన మాటలు మాట్లాడుతున్నారని గతంలో ఐదు సంవత్సరాలు పాటు రాష్ట్రాన్ని, ఆర్థిక వ్యవస్థని అల్లకల్లోలం చేసి నాశనం చేయడంతోనే ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఇంత కష్టపడాల్సి వస్తుందని అన్నింటిని ఒక ఆర్డర్ లోకి తీసుకురావడానికి చంద్రబాబు నాయుడు అనుక్షణం శ్రమిస్తున్నారని త్వరలోనే హామీ ఇచ్చిన ప్రతి పథకం అమలు జరుగుతుందని తెలిపారు. తమ ప్రభుత్వం కట్టడాలను కూల్చే ప్రభుత్వం కాదని కట్టడాలను, రాష్ట్రాన్ని నిలబెట్టే ప్రభుత్వం అని ఈ సందర్భంగా తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలోని కేజీబీవీలకు అదనపు నిర్మాణాలు,మౌలిక వసతుల కల్పనకై మంజూరైన నిధుల వివరాలు తెలియజేసారు. చోడవరం నియోజకవర్గ కేంద్రంలో అన్నా కాంటీన్ కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నామని ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆర్టీసీ కాంప్లెక్స్ కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో దీన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# చిట్టివలస పాఠశాల సందర్శన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర రావు మంగళవారం చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాల పీఎం పాఠశాలగా ఎంపికైనందున పీఎం నిధులతో జరుగుతున్న ప్లే ఫీల్డ్స్ అభివృద్ధి పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం చిట్టివలస జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణంలో ఉన్న టైపు-4 కేజీబీవీ సందర్శించి దానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేజీబీవీ బిల్డింగ్ లో రన్ అవుతున్న డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మేడంతో మాట్లాడి వచ్చే అకడమిక్ ఇయర్ కి ఈ కేజీబీవీ అందుబాటులోకి వస్తుంది కావున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.సూర్యనారాయణ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్.రోజామణి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్టివలస పీడీ వెంకటరెడ్డి, సైట్ ఇంజనీర్ మహాలక్ష్మి, సి ఆర్ పి త్రినాథ్ పాల్గొన్నారు.



# 'ప్రమాదకరమైన విద్యుత్ వైర్లను మార్చాలి'



**చోడవరం(విశాఖ సమాచారమ్):** చోడవరం పంచాయతీ పరిధిలో గల ఐ.టి.ఐ.కాలనీలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్న విద్యుత్ వైర్లు మార్చాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో స్థానికులు నిరసన తెలిపారు. చార్జీలు చెల్లిస్తేనే విద్యుత్ వైర్లు మారుస్తామని విద్యుత్తు శాఖ ఏఈ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పారిశుధ్య పనులు చేసుకుంటూ చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్న వారిని చార్జీలు చెల్లించమని అడగడం దారుణమని భారత్ కమ్యూనిస్టు పార్టీ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి పూర్తిగా విద్యుత్ అధికారులే బాధ్యులని,ఈ విషయాన్ని పైఅధికారులు తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్వాసితులు జలగడుగులు అప్పలరాజు, పోట్నూరు అరుణ, గణేష్, శివ పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులు ప్రారంభం




**గొలుగొండ (విశాఖ సమాచారమ్):** పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో 2025 సంవత్సరం ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ పోతురాజు, అడ్డూరి బంగారమ్మ, వీఆర్పీ రాయపురెడ్డి విజయ పాల్గొన్నారు.

# వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి

## - జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్టేగ్ హెూల్డర్స్ తో సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, జీవీఎంసీ నగరంలో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అలాగే నివాస సంక్షేమ సంఘం సభ్యులు, ఎన్జీవోస్, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా నగరంలో చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని, వారికి జీవీఎంసీ సహాకారం అందిస్తుందని, వారు కోరితే తాగునీరు అందిస్తామని తెలిపారు. వేసవిలో మధ్యాహ్నం వృద్ధులు పిల్లలు తప్పని పరిస్థితిలో తప్ప బయట తిరగరాదని వదులుగా వున్న తెలుపు రంగు కాటన్ దుస్తులు దరిస్తే మంచిదని సూచించారు. జీవీఎంసీ వేసవిలో తీసుకోవలసిన చర్యలు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే స్టేగ్ హెూల్డర్స్ కూడా సాధ్యమైనంత వరకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ప్రజలకు కల్పించాలని సూచించారు. అనంతరం స్టేగ్ హెూల్డర్స్ ప్రతినిధులు వారు చేపట్టే కార్యక్రమాలతోపాటు పలు సూచనలను అధికారులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు రాజేంద్ర కృష్ణ, జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, శివప్రసాద్, ఏ ఎమ్ ఓ హెచ్ లు డాక్టర్ కిషోర్, సునీల్, డా.అప్పలనాయుడు, బి.ప్రసాదరావు, కిరణ్, ఎస్ ఆర్ యు టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కాన్వాయ్ వల్ల జేఈఈ విద్యార్థులకు పరీక్ష ఆలస్యమైందనడం అవాస్తవం: విశాఖ సీపీ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖలో నిర్వహించిన జేఈఈ పరీక్షకు పలువురు విద్యార్థులు ఆలస్యం కావడం, అందుకు పవన్ కల్యాణ్ కాన్వాయ్ కారణం అంటూ దుమారం రేగడం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి జిల్లాలో పర్యటనకు వచ్చారని, ఆయన కాన్వాయ్ కారణంగానే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోలేకపోయారంటూ విమర్శలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో, తన కాన్వాయ్ కారణంగా పెందుర్తిలో విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరు కాలేకపోయారనే వార్తలపై విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. కాన్వాయ్ కోసం ఎంతసేపు ట్రాఫిక్‌ను నిలిపారు, పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులు వెళ్లే సమయంలో ఆ మార్గంలో ట్రాఫిక్ పరిస్థితి ఏమిటి, సర్వీసు రోడ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించారా వంటి అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆయన విశాఖ పోలీసులను కోరారు. ఈ నేపథ్యంలోనే విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి ఈ ప్రకటన చేశారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాన్వాయ్ కారణంగా జేఈఈ (మెయిన్) పరీక్షకు హాజరు కాలేకపోయినట్లు పెందుర్తికి చెందిన కొందరు విద్యార్థులు చేసిన ఆరోపణలను సీపీ ఖండించారు. విద్యార్థుల ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేశారు.

"డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా మేము ఎటువంటి ట్రాఫిక్ ఆంక్షలు విధించలేదు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి," అని అన్నారు. విద్యార్థులే ఆలస్యంగా వచ్చారని, ఆపై పోలీసులపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు.

ఈ విషయంపై సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల సెల్‌ఫోన్‌లను కూడా ట్రాక్ చేశామని సీపీ తెలిపారు. "పోలీసుల వల్ల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది జరగలేదు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్న తర్వాతే డిప్యూటీ సీఎం కాన్వాయ్ అక్కడి నుంచి వెళ్లింది" అని శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు.

విశాఖ సమాచారమ్
బుధవారం 9-4-2025

## శాంతి వైపు మావోయిస్టుల చూపు

ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న నేపథ్యంలో శాంతి చర్చలకు తాము సిద్ధమేనని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) ప్రకటించింది. గతంలో కూడా దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నక్సల్స్‌ను శాంతి చర్చలకు ఆహ్వానించడం ముఖాముఖి చర్చలు జరగడం తెలిసిందే. కానీ అవి ఫలించలేదు. ఇప్పుడు మావోయిస్టుల్లో కూడా ఎన్నడూ లేని విధంగా నిస్పృహ ఆవరించినట్లు చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో బయటపడిన ఒక లేఖ బట్టి తెలుస్తోంది. నక్సల్బైట్లకు సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయిందని ఆ లేఖ వెల్లడిరచింది. అయితే ఇప్పుడు శాంతి చర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదల చేసిన లేఖలో కొన్ని షరతులు విధించారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని డిమాండ్ చేశారు. విప్లవ ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కొత్త క్యాంపులు ఏర్పాటు చేయొద్దన్నారు. ఈ షరతులకు ఒప్పుకుంటే తక్షణమే కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాధారణ ఆదివాసీ ప్రజానీకంతోపాటు అగ్రనేతల వరకు 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, అనేక మందిని చిత్రహింసలకు గురిచేసి చంపేస్తున్నారని, అందుకే ఈ యుద్ధాన్ని జినోసైడ్ (నరసంహారం)గా పేర్కొంటున్నట్టు వెల్లడిరచింది. ఈ లేఖకు చత్తీస్‌గఢ్ సీఎం విజయశర్మ స్పందించారు. మొదట ఈ లేఖ సాధికారత ఎంతవరకు ఉందో పరిశీలిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా కొన్ని సందర్భాల్లో శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపునిచ్చారన్నారు. అయితే ఇప్పుడు శాంతి చర్చలకు మావోయిస్టులు విధించిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేది లేదన్నారు. గతంలో ప్రభుత్వం శాంతిచర్చల కోసం కమిటీలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు మావోయిస్టులే శాంతి చర్చలకు సిద్ధం అవుతుంటే వారు ఒక కమిటీ లేదా ఒక ప్రతినిధిని నియమించాలని విజయశర్మ సూచించారు. 2026 మార్చి 31 లోగా చత్తీస్‌గఢ్‌లో నక్సల్బైట్లు అన్నవారెవరూ లేకుండా నిర్మూలిస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ మేరకు భద్రతా దళాలు నిత్యం దండకారణ్యాన్ని జల్లెడపడుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ మరోవైపు నక్సల్ గాలింపు ముమ్మరం చేసింది. ఈ ద్విముఖ వ్యూహం బాగానే పని చేసిందని చెప్పవచ్చు. ఇదంతా ఒక్క రోజులోనే జరిగిందనడం పొరపాటు. నిఘా వర్గాలను బలోపేతం చేశారు. భద్రతా దళాల సాయంతో మావోల పట్టున్న ప్రాంతాలను నిర్వీర్యం చేయగలిగారు. అత్యాధునిక డ్రోన్లు, నిఘా పరికరాలు, కృత్రిమ మేధ, ఉపగ్రహ ఛాయాచిత్రాల వంటి సాయంతో నక్సల్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. నక్సల్స్ ఆర్థిక మూలాలపై కూడా దాడులు జరుగుతున్నాయి. నక్సల్స్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వారిని కూడా కట్టడి చేయగలిగారు.

ఇవన్నీ ఒకవైపు సాగిస్తూనే నక్సల్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు బాగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2014 నుంచి 2024 మధ్య కాలంలో ఆయా ప్రాంతాల్లో దాదాపు 11,503 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 20 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఏర్పాటయ్యాయి. దీనివల్ల అక్కడి ప్రజల జీవన విధానాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. వెయ్యికి పైగా బ్యాంకు శాఖలు, 937 ఏటీఎంల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. 2004%-%2014 మధ్యకాలంతో పోలిస్తే ఇప్పుడు హింసాత్మక సంఘటనలు సగానికి సగం తగ్గాయి. ఏడాది కాలంలోనే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో 380 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. 1194 మంది అరెస్టు కాగా, 1045 మంది లొంగిపోయారు. వాస్తవంగా చెప్పాలంటే నక్సలిజ ప్రభావం చాలా వరకు తగ్గిందనే చెప్పవచ్చు. ఒకప్పుడు మావోయిజానికి ఆదివాసీ యువకులు విపరీతంగా ఆకర్షితులయ్యేవారు. కానీ ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు.

### పంచాంగం

బుధవారం 9-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంత రుతువు
చైత్ర మాసం

| | |
|---|---|
| తిథి | : శు. ద్వాదశి రా. 10.56 |
| నక్షత్రం | : మఘ ప. 9.57 |
| వర్జ్యం | : సా. 6.47 ల 8.33 |


### మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**


# బహుముఖ ప్రజ్ఞాశాలి మన్నవ బాలయ్య

## నేడు జయంతి, వర్ధంతి సందర్భంగా..

సందర్భోచితం



నటుడు, నిర్మాత, దర్శకుడు, రచయిత ఇలా తన బహుముఖ ప్రజ్ఞతో చిత్రసీమకు సేవలందించారు సీనియర్ నటులు మన్నవ బాలయ్య. అతి సౌమ్యు నిగా పేరొందిన ఆయన 'అమృత ఫిలిమ్స్' పతా కంపై తన అభిరుచికి తగ్గ చిత్రాలను నిర్మించారు. కొన్నిటికి దర్శకత్వమూ వహించారు. వందలాది చిత్రా లలో కేరెక్టర్ యాక్టర్ గా నటించి మెప్పించారు.

**మొదట్లో కథానాయకుడే..**

మన్నవ బాలయ్య 1930 ఏప్రిల్ 9న గుంటూరు జిల్లా అమరావతి సమీపంలోని వైకుంఠపురములో జన్మించారు. ఆయన తండ్రి మన్నవ గురవయ్య, తల్లి అన్నపూర్ణమ్మ. బాలయ్య కన్నవారు ఇద్దరూ సాహిత్యాభిలాషులు. చదువంటే ప్రాణం. అందు వల్ల తమ అబ్బాయిని బాగా చదివించాలని తపిం చారు. అదే రీతిన బాలయ్య కూడా ఆ రోజుల్లోనే బి.ఇ., చదివారు. 1952లో బి.ఇ., పట్టా పుచ్చుకో గానే కాకినాడ, మద్రాసు పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్‌గా పనిచేశారు. అప్పట్లోనే ఆయన నాట కాలు వేసేవారు. బాలయ్యను చూసిన కొందరు హిందీ నటుడు అశోక్ కుమార్ లాగా ఉన్నావ నేవారు. దాంతో ఆయనకు కూడా సినిమా రంగం పై ఆసక్తి కలిగింది. మిత్రుల ప్రోత్సాహంతో చిత్ర సీమలో అడుగు పెట్టారు. అప్పటికే 'రోజులు మారాయి' చిత్రంతో దర్శకునిగా తనదైన బాణీ పలికించిన తాపీ చాణక్యను కలిశారు. ఆయన కూడా బాలయ్యను ప్రోత్సహిస్తూ తాను తెరకెక్కించిన 'ఎత్తుకు పైఎత్తు' చిత్రంతో హీరోని చేశారు. సారథీ స్టూడియోస్ నిర్మించిన ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. వరు సగా చాణక్య దర్శకత్వంలో సారథీ స్టూడియోస్ నిర్మించిన 'భాగ్యదేవత, కుంకుమ రేఖ' సినిమా ల్లోనూ బాలయ్య నాయక పాత్రల్లో కనిపించారు. ఈ సినిమాలో బాలయ్యకు ఓ గుర్తింపు లభిం చింది. కమల్ ఘోష్ అనే బెంగాలీ నిర్మించిన 'మనోరమ' చిత్రంలో బాలయ్య హీరోగా నటిం చారు. అప్పటికే బెంగాల్ సినిమా రంగంతో అను బంధం ఉన్న ప్రముఖ సంగీత దర్శకుడు రమేశ్ నాయుడు ఈ సినిమాకు సంగీతం సమకూర్చారు. ఇందులో ప్రఖ్యాత హిందీ నేపథ్యగాయకుడు తలత్ మహమ్మద్ తో తెలుగు పాటలు పాడిరచారు. "అందాలసీమా సుధా నిలయం.." అనే తలత్ మహమ్మద్ పాడిన పాట ఆ రోజుల్లో సంగీత ప్రియులను అలరించింది.

**విలక్షణమైన పాత్రల్లో..**

మహానటి సావిత్రి తన నటజీవితంలో మరపు రాని చిత్రంగా పేర్కొన్న 'చివరకు మిగిలేది'లో కీలక పాత్ర పోషించి అలరించారు బాలయ్య. ఆ పై ఆదుర్తి సుబ్బారావు తెరకెక్కించిన 'కృష్ణప్రేమ' పౌరాణికంలో తొలిసారి కృష్ణునిగా నటించారు. కె.ఎస్.ప్రకాశరావు తెరకెక్కించిన 'మోహినీ రుక్మాంగధ'లో రుక్మాంగధునిగా అభినయించారు. వరుసగా కథానాయక పాత్రల్లోనే నటించినా, ఎందుకనో బాలయ్య ఆశించిన విజయం దరి చేరలేదు. దాంతో ఇతర హీరోల చిత్రాలలో కీలక పాత్రలు పోషించసాగారు. ఎన్టీఆర్ తో "ఇరుగు - పొరుగు, బభ్రువాహన, బొబ్బిలియుద్ధం, పాండవ వనవాసము, వివాహబంధం, శ్రీక్రిష్ణపాండ వీయం" వంటి చిత్రాలలో నటించారు. 'పాండవ వనవాసము'లో ఎన్టీఆర్ భీమునిగానూ, బాలయ్య అర్జునునిగా నటించారు. దాంతో ఎన్టీఆర్ తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'శ్రీక్రిష్ణ పాండవీయం'లో ధర్మరాజు పాత్రలో బాలయ్యను నటింప చేశారు. ఇక ఎన్టీఆర్ తో ఎస్.డి.లాల్ ని ర్మించి, తెరకెక్కించిన 'నేనే మొనగాణ్ణి'లో బాలయ్య విలన్ గా నటించడం విశేషం! ఆ తరువాత నుంచీ బాలయ్యను కేరెక్టర్ రోల్స్ పలకరించాయి. నిర్మాతగా కొనసాగుతున్న సమయంలోనే బాలయ్య వైవిధ్యమైన నటునిగానూ మెప్పించారు. 'నామాల తాతయ్య'లో శ్రీనివాసుని పాత్రలో నటించారు. ఇక 'భక్త కన్నప్ప, జగన్మాత' వంటి పురాణగాథల్లో శివునిగా మెప్పించారు. అనేక జానపద, చారిత్రక, పౌరాణికాల్లో ప్రముఖ పాత్రలే ధరించారు. ఎన్టీఆర్ చివరి చిత్రంగా తెరకెక్కిన 'మేజర్ చంద్రకాంత్' లోనూ ఆయన మిత్రునిగా నటించారు

**నిర్మాతగా..**

బాలయ్య ఓ వైపు నటిస్తూనే మరోవైపు తన వద్దకు వచ్చిన అనేక మంది విద్యార్థులకు ఇంగ్లిష్ , మ్యాథ్స్ బోధించేవారు. ఆయన కథలు కూడా రాసేవారు. బాలయ్య రాసిన కథలు కొన్ని పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. దాంతో తన కథలపై తనకే నమ్మకం కుదిరింది. మిత్రుల సహకారంతో 'అమృతా ఫిలిమ్స్' సంస్థను నెలకొల్పారు. దర్శకుడు కె.విశ్వనాథ్ తో తన కథల గురించి చర్చించేవారు. వాటిలోని వైవిధ్యం విశ్వనాథ్ కూ బాగా నచ్చింది. 'తుఫాన్' అనే పత్రికలో బాలయ్య రాసిన 'నలుపు-తెలుపు' అనే కథ ముద్రితమైంది. ఆ కథ ఆధారంగానే గొల్లపూడి మారుతీరావుతో కలసి 'చెల్లెలి కాపురం' కథ తయారు చేశారు బాలయ్య. అలా బాలయ్య తన సమర్పణలో విశ్వనాథ్ దర్శకునిగా 'చెల్లెలి కాపురం' నిర్మించారు. శోభన్ బాబుకు నటునిగా ఈ సినిమా ఎనలేని పేరు సంపాదించి పెట్టింది. ఉత్తమ చితంగా బంగారు నందిని అందుకుంది సినిమా. ఆ తరువాత కృష్ణ హీరోగా విశ్వనాథ్ దర్శకత్వంలో 'నేరము-శిక్ష' తీశారు. ఈ సినిమా కూడా మంచి ఆదరణ పొందింది.

**తమిళంలోనూ..**

రష్యన్ రచయిత ఫ్యైడర్ దోస్టోవస్కీ రాసిన 'క్రైమ్ అండ్ పనిష్ మెంట్' కథ ఆధారంగా 'నేరము-శిక్ష' కథ తయారు చేశారు బాలయ్య. ఈ సినిమాలో నటునిగా బాలయ్యకు మంచి మార్కులు పడ్డాయి. ఈ చిత్రాన్ని చూసిన నాటి తమిళ సూపర్ స్టార్ ఎమ్.జి.రామచంద్రన్ ఎంతగానో అభినందించి, ఆ సినిమాను రీమేక్ చేయడానికి హక్కులు తీసుకున్నారు. 'నీదిక్కు తల్కైవనంగు' పేరుతో ఎమ్జీఆర్ తమిళంలో రీమేక్ చేశారు. తెలుగులో బాలయ్య పాత్రను తమిళంలోనూ ఆయనకే ఇచ్చారు ఎమ్జీఆర్.

**ఎన్టీఆర్ స్ఫూర్తి!**

బాలయ్య హిందీలో పృథ్వీరాజ్ కపూర్, శాంతారామ్‌ను, తెలుగులో ఎన్టీఆర్ ను అభిమా నించేవారు. ఎన్టీఆర్ తో కలసి పనిచేయడం వల్ల ఆయన క్రమశిక్షణకు ఆకర్షితులయ్యారు. ఇక ఎన్టీఆర్ 'శ్రీక్రిష్ణపాండవీయం'లో నటించే సమయంలోనే నిర్మాతగా రామారావు బడ్జెట్ ను ఎంతలా కంట్రోల్ చేస్తారో ప్రత్యక్షంగా చూశారు. అదే రీతిన తాను నిర్మించే చిత్రాల విషయంలోనూ బడ్జెట్ ను కంట్రోల్ చేసుకొనేవారు బాలయ్య. నిజానికి 'చెల్లెలి కాపురం' విజయం తరువాత శోభన్ బాబుతోనే 'నేరము-శిక్ష' నిర్మించాలని ఆశించారు బాలయ్య. కథ విన్న శోభన్, ఆ సినిమాను కలర్ లో తీస్తేనే నటిస్తానని భీష్మించుకున్నారు. దాంతో కృష్ణ దగ్గరకు 'నేరము-శిక్ష' కథ వెళ్ళింది. బాలయ్య తన చిత్రాలలో సంగీత సాహిత్యాలకూ పెద్ద పీట వేసేవారు. తొలి చిత్రంలోనే 'చరణ కింకిణులు ఘల్లు ఘల్లు మన' వంటి పాటను సినారెతో రాయించుకొని మురిపించారు. ఈ పాటతోనే గాయకునిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఎనలేని కీర్తి లభించింది. తరువాత ఆయన నిర్మించిన నేరము-శిక్ష, అన్నదమ్ముల కథ, ఈ నాటి బంధం ఏ నాటిదో, ప్రేమ-పగ వంటి చిత్రాలు మంచి పేరుతెచ్చాయి.

**కృష్ణతో బంధం!**

'నేరము-శిక్ష' తరువాత బాలయ్యకు, హీరో కృష్ణకు మంచి అనుబంధం ఏర్పడిరది. బాలయ్య 'అన్నదమ్మల కథ' తీసే రోజుల్లోనే కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' తెరకెక్కిస్తున్నారు. అందులో అగ్గిరాజు పాత్రకు తొలుత యస్వీ రంగారావును అనుకున్నారు. కానీ, ఆయన అనారోగ్య కారణాల వల్ల ఆ పాత్రలో నటించడానికి వీలు పడలేదు. ఆ సమయంలో కృష్ణకు చప్పున బాలయ్య గుర్తుకు వచ్చారు. ఆయన కూడా ఓకే అనడంతో అగ్గిరాజు పాత్రలో బాలయ్య నటించి మంచి పేరు సంపాదించారు. ఆ తరువాత కృష్ణతో "ఈ నాటి బంధం ఏ నాటిదో, చుట్టాలున్నారు జాగ్రత్త" వంటి చిత్రాలు నిర్మించారు బాలయ్య. చిరంజీవితో 'ఊరికిచ్చిన మాట' నిర్మించడమే కాదు, ఆ చిత్రానికి దర్శకత్వమూ వహించారు. ఆ పై కృష్ణంరాజుతో 'నిజం చెబితే నేరమా' తీశారు. 'చుట్టాలున్నారు జాగ్రత్త' నుంచి ఎమ్.ఎస్. విశ్వనాథన్ తో వరుసగా స్వరకల్పన చేయించారు బాలయ్య. తరువాత తన తనయుడు తులసీరామ్ ను హీరోగా పరిచయం చేస్తూ 'పసుపుతాడు' అనే సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించారు. రాధ నాయికగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. దాంతో చిత్ర నిర్మాణానికి దూరంగా ఉండి నటనకే పరిమితమయ్యారు. ఎన్టీఆర్ నటవారసుడు బాలకృష్ణతోనూ బాలయ్య కొన్ని చిత్రాలలో అభినయించారు. బాపు 'శ్రీరామరాజ్యం'లో వశిష్టుని పాత్రలో కనిపించారు. ఆ తరువాత వయసు సహకరించక పోవడంతో నటనకు దూరంగా ఉన్న బాలయ్య 2022 ఏప్రిల్ 9న హైదరాబాద్ యూసఫ్ గూడలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.

**సుగుణశేఖర్ రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)**

## అలరించిన 'సురభి' నాటకోత్సవం

భారతదేశ, ప్రత్యేకించి తెలుగు నాటకరంగం గర్వించే సంస్థ 'సురభి'. పాశ్చాత్యీకరణ, ఆధునీకరణ ఇత్యాది కారణాలతో ప్రాభవం కోల్పోతున్న దశలో - సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా సురభి మహోత్సవాన్ని తలపెట్టడం ముదావహం, సురభికి 141వ ఏడాది వస్తున్న సందర్భంగా ఈనెల 15 - 20 తేదీల్లో విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల ఆవరణలో రోజుకొకటి చొప్పున ఆరు నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. సురభి ప్రదర్శన అంటేనే ఒక ప్రత్యేకం, అద్భుతం! నారదుడు దివి నుంచి భువికి దిగడం.. స్టేజిపై రథం, యుద్ధ విన్యాసాలు.. కంసుడు బాలికను పైకెగరేస్తే అక్కడే ఆగి హెచ్చరించడం.. కాటేయడానికొచ్చిన పామును గరుడ పక్షి తన్నుకెళ్లిపోవడం%ౌ% సముద్రంలో మునిగిపోతున్న ప్రహ్లాదుణ్ణి విష్ణుమూర్తి పైకి తీసుకురావడం%ౌ% తాపసి చుట్టూ పుట్ట క్రమంగా పెరగడం%ౌ% వంటి ప్రేక్షకుల్ని తన్మయుల్ని చేసే వైర్ వర్క్ విన్యాసాలు సురభికే సాధ్యం. మిరుమిట్లు గొలిపే లైటింగ్‌లో జిగేలు జిగేలుమనే పాత్రోచిత డ్రస్సులు, ఆభరణాలు సురభి ప్రదర్శనల్లోనే తనివితీరా, కనులారా కాంచగలం. లైట్స్ ఆఫ్ అండ్ ఆన్ గ్యాప్ అతి కొద్ది సెకన్లు మాత్రమే! దాదాపు ప్రతి నాటకంలో 40 - 50 మంది పాత్రధారులు, అందులో సగానికి తగ్గకుండా స్త్రీలు ఉండడం సురభికే చెల్లు. పసి గుడ్డు నుంచి పండు ముసలి వరకూ ఆయా పాత్రల్లో పాల్గొంటారు.

ఇలా పలు ప్రశంసనీయ అంశాలతో పాటు ఒకటి రెండు ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలి. ఏడెనిమిది తరాల అనంతరం చాలా మంది సురభి కళాకారుల వాచకం, అభినయం, గాన మాధుర్యం ఇంకా మెరుగు పడాలని చెప్పాల్సి రావడం నిష్ఠుర సత్యం. పోర్షన్ గుర్తురాక కొన్ని క్షణాలు ఆగిపోవడం, పక్క నుంచి అందించడం.. ఒకరి డైలాగ్ పూర్తవ్వకుండానే వేరొకరు డైలాగ్ ఎత్తేయడం.. ఇత్యాది లోపాలను సరిజేసుకోవడం సురభి కీర్తిని మసకబార్చకుండా చేస్తుంది. వాస్తవానికి సురభిలో ప్రజ్ఞావంతులకు కొదవ లేదు. అవేటి పూర్ణిమలూ, గూడూరు సావిత్రిలూ, జమునా రాయలులూ, మనోహర్రావులూ, పద్మశ్రీ బాబ్జీలూ వెంటనే స్ఫురిస్తారు. ప్రస్తుత సమాజాల్లోనూ మంచి కళాకారులు లేకపోలేదు. అదే సందర్భంలో- సురభి కుటుంబాలకు చెంది, వేరే సమాజాల నాటకాల్లో అద్భుతంగా రాణిస్తున్న ప్రభావతులనూ లలితలనూ ఈ సమాజాలు ఇమిడ్చుకోలేకపోతున్నాయో, వారే ఇమడలేకపోతున్నారో..!

ఇంత భారీ నెట్ వర్క్‌తో ప్రదర్శనలిస్తున్న సురభి ఇప్పటికీ పౌరాణిక (ఒకటీ అరా జానపద) నాటకాలకే పరిమితమవుతోంది. జన జాగృతికి దోహదపడే ఎన్నో సాంఘిక ఇతివృత్తాల్ని తయారుజేసుకుని జనరంజకంగా ప్రదర్శనలివ్వొచ్చు. సురభి ఈ కోణంలో కూడా దృష్టి సారించాలని నాటకాభిమానుల ఆకాంక్ష. వాస్తవానికి సురభి గతంలో ఒకటీ అరా సాంఘిక నాటకాలు ఆడకపోలేదు. అయితే చాలా కాలంగా ఆ ఊసే లేదు. ఇప్పుడు ప్రదర్శిస్తున్న ఇతివత్తాలు దాదాపుగా అందరికీ తెలిసినవే అయినందున.. కథాపరంగా మున్ముందేం జరగబోతుందోనని ప్రత్యేక ఆసక్తీ ఉత్సుకతా ఉండవు. అయినా ప్రేక్షకులు రోజూ అధిక సంఖ్యలో విచ్చేయడం సురభి పట్ల ప్రేక్షకుల క్రేజ్ గ్లామర్‌కు నిదర్శనం.

**ప్రదర్శనల పరామర్శ**

నాటకోత్సవం మొదటి రోజు శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ (హైదరాబాద్), శ్రీ విజయ భారతీ నాట్యమండలి (నార్కట్ పల్లి) వారు 'భక్త ప్రహ్లాద' ప్రదర్శించారు. హిరణ్యకశిపుడు పాత్రధారి సురభి జయచంద్రవర్మ దర్శకత్వం వహించారు. రచన : కీ.శే.ధర్మవరపు కృష్ణమాచార్యులు. బుల్లి ప్రహ్లాదుడు నూటరెండు జ్వరంతో స్టేజీ ఎక్కడం ఆ సమాజాల కమిట్మెంట్‌కు తార్కాణం. ప్రధాన ప్రహ్లాదుడి అభినయం, గానం బాగున్నాయి. రెండో రోజు 'లవకుశ' నాటకాన్ని శ్రీ భానోదయ నాట్యమండలి (వరంగల్), శ్రీ శారదా నాట్యమండలి (నార్కట్ పల్లి) వారు ప్రదర్శించారు. రచన : మల్లాది వేంకట కష్ణ శర్మ. దర్శకత్వం : ఆర్.నాగబాబు (శ్రీరామ పాత్రధారి). శ్రీరామ పట్టాభిషేకంతో నాటకం ప్రారంభమై.. లవకుశులకు పట్టాభిషేకం, అనంతరం శ్రీరాముడి అవతార సమాప్తితో ముగుస్తుంది. ఉన్నంతలో లక్ష్మణ పాత్రధారి పద్య గానం కొంత బెటర్. లవ కుశులు ఓకే.

మూడో రోజు వి.ఉమాశంకర్, అవేటి మనోహర్ సమాజాలు 'యాదాద్రి మహోద్భవం' నాటకాన్ని ప్రదర్శించాయి. రచన, దర్శకత్వం : సురభి రఘునాథ్ (మేకప్). దాదాపు మూడో వంతు నాటకం భక్త ప్రహ్లాదే. వైర్ వర్క్ విన్యాసాలు అంత ప్రభావవంతంగా కుదరలేదు. నాలుగో రోజు సురభి డ్రామా థియేటర్, శ్రీ బాలాజీ సురభి థియేటర్ వారు 'శ్రీకృష్ణలీలలు' ప్రదర్శించారు. రచన : పండిట్ కె.సుబ్రహ్మణ్య శాస్త్రి. దర్శకత్వం : సురభి ఎం.నాగరాజు. క్లైమాక్స్- కంసవధ ఘటనను అనలేమాత్రం ఎస్టాబ్లిష్ చేయకుండానే 'మమ' అనిపించారు. తర్వాత డైలాగ్స్‌ను బట్టి అర్థమైంది కంసుడ్ని కృష్ణుడు సంహరించాడు అని. మహిళలు ఎక్కువమంది పాల్గొన్న సన్నివేశాల్లో కాస్త గడబిడ అనిపించి.. డైలాగులు సరిగా అర్థం కాలేదు.

ఐదో రోజు శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, శ్రీ శారదా కళా మనో వినోదిని వారు 'జై పాతాళ భైరవి' ప్రదర్శించారు. దర్శకత్వం : ఆర్.చిన్న వెంకట్రావు. ప్రదర్శన నీట్‌గా, హాయిగా సాగింది. వైర్ వర్క్ విన్యాసాలు చాలా వరకు సింక్రనైజై అలరించాయి. అలనాటి ఎన్టీఆర్, ఎస్వీఆర్ తదితర అగ్ర తారాగణం సూపర్ డూపర్ హిట్ సినిమాయే ఈ నాటకం. తోట రాముడు (హీరో), రాజు, రాజకుమారి, రాజు బావమరిది ఓకే. నేపాళ మాంత్రికుడు సూపర్. ఆఖరి రోజు సురభి ఆర్ట్స్ అసోసియేషన్, సురభిళ నాట్య కళా మండలి వారు 'మాయాబజార్' ప్రదర్శించారు. రచన : మల్లాది వేంకట కష శాస్త్రి. దర్శకత్వం: సురభి ప్రసాద్. చిన్న చిన్న మినహాయింపులున్నా మొత్తంగా చూసుకున్నప్పుడు నాటకం అలరించింది. ప్రధాన పాత్రధారులందరూ బాగానే చేశారు. వైర్ వర్క్ ట్రిక్స్ కూడా చాలావరకు వర్కవుటయ్యాయి. గతంలో తెలిసినదానికి భిన్నంగా ఈ కథలో బలరాముడు, శ్రీ కృష్ణుడు మధ్య ప్రత్యక్ష వాగ్వాదం గమనిస్తాం.

మొత్తంగా చూసుకున్నప్పుడు సురభి నాటకోత్సవం విజయవంతమైనట్టే! పండిత, పామరులతో పాటు సహృదయుల్ని అన్ని విధాలా మెప్పించేంతగా.. ఆధునిక నాటక రంగ తీరుకూ మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా సురభి తనను తాను స్థిరంగా వృద్ధి చేసుకోవాలి. ప్రభుత్వాలు కూడా సురభిని ఆదుకునేందుకు సదా సిద్ధంగా ఉండాలి. ఈ ఆర్రోజుల సురభి నాటకోత్సవాన్ని ఎస్.జడ్.సి.సి.నుంచి పురాణం మాధవి (సురభి రిసెర్చర్) సమన్వయపరిచారు.

**జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్**
**9912615747**

## ధీరోదాత్తుడు శ్రీరామచంద్రుడు



ఒకసారి వాల్మీకి ఆశ్రమానికి నారదమహర్షి వచ్చారు.నారదుడికి అర్ఘపాద్యాలు సమర్పించి ఉచిత ఆసనం చూపించారు.అనంతరం వాల్మీకి కి ఎంతో కాలంగా వేధిస్తున్న ప్రశ్న ను నారద మహర్షిని అడిగాడు. ఆ ప్రశ్న ను ఇలా అడిగాడు. ఈ ప్రపంచంలో 16 ధీరోదాత్తగుణాలున్న మానవుడు ఉన్నాడా,చంద్రుని లాగా షోడష కళలు ఉన్న మానవుడు ఉంటాడా అని ప్రశ్నించారు.అంత మహర్షి నీ సందేహం న్యాయమైనదే.అలాంటి సకల గుణాలున్న మహావీరుడు ఉన్నాడు.అతను కోసల రాజ్యం మహారాజు దశరథుని పెద్దకుమారుడు శ్రీరామచంద్రుడు . శ్రీరాముడికి ఉన్న 16 లక్షణాలూ ఇలా మహర్షి వివరించాడు.

**గుణవంతుడు:** నిరాడంబరుడు,అందరితో కలిసిమెలిసి సంచరించేవాడు.

**మహావీరుడు:** ఎంతటి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోడు.

**ధర్మాత్ముడు:** 'రామో విగ్రహవాన్ ధర్మః' అంటారు.పితృవాక్య పాలకుడు, ధర్మ రక్షకుడు.

**కృతజ్ఞుడు:** తనకు చిన్న సహాయం చేసినవారికి మహెూపకారం చేసేవాడు.తనకు కీడు తలపెట్టిన వారిని సైతం క్షమించే గుణం ఉంది.

**సత్యవాక్పరిపాలకుడు:** ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాట తప్పేవాడు కాదు.

**ధృడమనస్కుడు:** చేపట్టిన కార్యం పట్టుదలతో సాధించే వాడు.

**శీలం వంతుడు:** ఒకే భార్య అనే నియమానికి చివరివరకూ నిలబడిన వాడు.

**సర్వభూతాలకూహితుడు:** విశ్వంలోని అన్ని జీవుల పట్ల కరుణకలవాడు.

**విద్వాంసుడు:** సకల విద్యా పారంగతుడు.

**సమర్థుడు:** ఏ కార్యాన్నైనా సాధించే నేర్పరితనం కలవాడు.

**ప్రియదర్శనుడు:** " పుంసాం మోహన్ రూపాయ" అంటారు. ఆయన సుందర రూపం మగవాళ్లను కూడా సన్మోహనం చేస్తుంది.

ఆత్మస్థైర్యం కలవాడు:దేనికీ భయపడని వాడు.

**జితక్రోధుడు:** ఎల్లప్పుడు కోపాన్ని అదుపులో ఉంచుకునేవాడు. ఆయన లోపించినా అది నిజమైనది కాదు.కావాలని చూపించేది.

**ద్యుతిమంతుడు:** ఎంతో ప్రకాశంతో వెలిగే వాడు.

**అనసూయాపరుడు:** ఏ విషయంలోనూ,ఎవరిపైనా అసూయ లేనివాడు.

**జాతరోషుడు:** ఆయనకు ఆగ్రహం రాదు.వస్తే దేవతలు సైతం తల్లడిల్లుతారు. వారధి నిర్మాణం సమయంలో సముద్రుని పై ఆగ్రహం వ్యక్తం చేస్తే ఆయన వణుకుతూ ప్రత్యక్షమయ్యాడు.

అనంతరం నారదుడు వాల్మీకికి సంక్షేప్త రామాయణం 100 శ్లోకాలతో రామాయణం వివరించాడు.అనంతరం బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై రామాయణం రాయమని వాల్మీకిని ఆదేశించాడు.అప్పటికే శ్రీరాముడు అయోధ్యను పరిపాలిస్తున్నాడు.వాల్మీకికి రామాయణ రచనలో అవసరమయ్యే భూతభవిష్యత్ సమాచారం దివ్యదృష్టితో లభించేలా వరం ఇచ్చాడు.అలా వాల్మీకి రామాయణానికి శ్రీకారం చుట్టారు.

అంతటి ధీరోదాత్తలక్షణాలుగల శ్రీరాముని భార్య సీత భవిష్యత్తులో ఆయన ఆశ్రమంలో ఉండి లవకుశులు జన్మనిచ్చింది.

**యం.వి.రామారావు,8074129668**

# పీఎం జన్మన్ పథకం గిరిజనులకు వరం

## మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ సమిదాసింగ్



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రధానమంత్రి జన్మన్ పథకం ఆదివాసీ గిరిజనులకు వరమని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ సమిదా సింగ్ అన్నారు. మండలంలోని తాజంగి, లంబసింగి, పెద బరడ పంచాయతీలలో ఆకస్మికంగా పర్యటించిన సింగ్ ముందుగా తాజంగిలో గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం లంబసింగి పంచాయతీ జల్లూరు మెట్ట, రాజు బంద గ్రామాల్లో ప్రధానమంత్రి జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. పెదబరడ పంచాయతీలో కాఫీ ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డీఈ రఘు, ఏఈ యాద కిషోర్, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ రమణ, పంచాయతీ కార్యదర్శి, ఐటీడీఏ ఏపీఓ లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# సదరం స్లాట్లు సద్వినియోగం చేసుకోవాలి

## - దొండా నరేష్



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల కోసం సదరం స్లాట్లు ఓపెన్ అయ్యాయని వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ తెలిపారు. కంటి సంబంధిత, పుట్టుకతో మెంటల్లీ డిజార్డర్, రోడ్డు ప్రమాదాల ద్వారా మెంటల్లీ డిజార్డర్ అయిన వారు సదరం స్లాట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. నిర్దేశిత సమయానికి సంబంధిత ఆస్పత్రులకు వెళితే వైద్యులు అంగవైకల్యం నిర్ధారిస్తారన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలు వచ్చాక ప్రభుత్వం సామాజిక పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. దివ్యాంగులు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి సదరం స్లాట్లు బుక్ చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు తలారి శంకర్, కోవెల వెంకటరమణ, కోరుకొండ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# కేపీ అగ్రహారంలో 'ఉపాధి' పనులు ప్రారంభం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని కేపీ అగ్రహారంలో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ సీనియర్ నాయకుడు అద్దూరి శ్రీను, గ్రామ కూటమి అధ్యక్షుడు తూరుబిల్లి నూకరాజు, టీడీపీ యువజన అధ్యక్షుడు దేవర భూలి నాయుడు, జనసేన మండల కార్యదర్శి సుంకర శ్రీను, నీటి సంఘం వైస్ చైర్మన్ అద్దిపిల్లి గోవింద, మాజీ స్కూల్ చైర్మన్ పడాల పెదరమణ, తాటికొండ నాగేషు, అద్దిపిల్లి సోమినాయుడు, గోపిశెట్టి నూకరాజు, వియ్యపు ముసలి నాయుడు, గోపిశెట్టి రమణ, వియ్యపు రమణ, గోకివాడ శ్రీను, వీఆర్పీ రమేష్, ఎస్ ప్రకాష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# Spoken English -21

Basic English Conversations:

We would like to share with you the 10 Basic English conversations. The topics level for English beginners. If you are a newbie in learning English, they are suitable for you

Lesson 1: WHERE ARE YOU FROM? (నీవు ఎక్కడి నుండి)

Hello. –హలో!

Hi - హాయ్

How are you?- నీవు ఎలా వున్నావు?

I'm good. How are you? - నేను మంచిగానే వున్నా. మీరు ఎలా ఉన్నారు?

Good. Do you speak English? - మంచిది. మీరు ఇంగ్లీషు మాట్లాడతారా?

A little. Are you American? - కొద్దిగా. మీరు అమెరికా వారా?

Yes. - అవును

Where are you from?- మీరు ఎక్కడి నుండి వచ్చారు?

I'm from California. - నేను కాలిఫోర్నియా నుండి వచ్చా

Nice to meet you.- మిమ్మల్ని కలవడం సంతోషం.

Lesson 2: DO YOU SPEAK ENGLISH? - మీరు ఇంగ్లీషు మాట్లాడతారా?

Excuse me, are you American? - మన్నించండి, మీరు అమెరికా వారా?

No. - కాదు

Do you speak English? - మీరు ఇంగ్లీషు మాట్లాడతారా?

A little, but not very well.- ఏదో కొద్దిగా.., బాగా కాదు.

How long have you been here? - మీరు ఇక్కడ ఎంత కాలం నుండీ ఉంటున్నారు?

2 months.- రెండు నెలలు.

What do you do for work? -- ఏం పని చేస్తున్నారు?

I'm a student. How about you? - నేను విద్యార్థిని. మరి మీరు?

I'm a student too. - నేను కూడా విద్యార్థినే

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

**(Visakha Samacharam)**

# ఉత్సాహభరితంగా సయోనరా ఫేర్వెల్ 2 కే 25








**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగపు మొదటి సంవత్సరం విద్యార్థులచే సీనియర్ విద్యార్థులకు ' ఫేర్వేల్ 2కె 25 సయోనర ' అను పేరుతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ వేడుక ఆంధ్రా యూనివర్సిటీ టిఎల్ఎన్ హాల్లో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో జూనియర్ విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జూనియర్ విద్యార్థిని విద్యార్థులు ఉమేష్ , దుర్గాదేవి , సంజీవినీ, అశ్విత, ఇందిరా, దుర్గా భవాని, సౌజన్యలు తమ నృత్యం తో సభికులను రంజింప జేసారు. విదేశీ విద్యార్థులు తమ దేశ సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేసారు. వచ్చిన అతిథులకు శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. నరసింహారావు , విభాగపు అధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందంలు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు . అధ్యాపకులు ప్రొఫెసర్ సులేమాన్, ప్రొఫెసర్ .వీర్రాజు, డా.కె.సత్యనారాయణ, డా. హరీష్ , డా.రత్న రాజు, డా.టి.నాగరాజు, డా.పీ వీ రామ్, డా.అత్తిలి ప్రసాద్, డా.జి.ప్రియాంక, డాక్టర్ .డి.రంగనాథ్ రాయ్, డా. వి. దంతేశ్వర రావు,బి.సొనాలీలు వీడ్కోలు సందేశాలను ఇచ్చారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాస్త్రంలో నిరుద్యోగులకు నాబార్డు చేయూత

## మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగ యువతకు నాబార్డ్ ద్వారా రాయితీపై ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వ్యవసాయ క్లినిక్, వర్మీ కంపోస్ట్ తయారీ యూనిట్స్, చేతల గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నిర్మాణానికి సంబంధించి కావలసిన సహాయ, సహకారాలు అందించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వ్యవసాయ శాఖ ద్వారా 2025 ఖరీఫ్ సీజన్‌కు గాను రైతులకు కావల్సిన పంట రుణాలపై అవగాహన కల్పిస్తూ పంట రుణాలు నిమిత్తం దరఖాస్తులు స్వీకరించి మండలంలో ఉన్న బ్యాంక్‌లకు అందిస్తామన్నారు. రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రంలో పంట రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటికి మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పనిచేయాలని కోరారు. అదే క్రమంలో వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగ యువతకు నాబార్డ్ ఆర్థిక సహకారంతో రాయితీలు ఇచ్చి వ్యవసాయ క్లినిక్‌లు , వర్మీ కంపోస్ట్ తయారీ యూనిట్స్, శీతల గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు కావల్సిన సహాయ, సహకారాలను పొందవచ్చన్నారు. ఆసక్తి ఉండి అర్హత కలిగిన వారు కార్యాలయ పని దినాల్లో తనను సంప్రదించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 83310 56448లో సంప్రదించవచ్చునని అన్నారు. ఈ సదవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# జిల్లాలో తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చెయ్యాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే గ్రామ పంచాయతీల్లోని వాటర్ ట్యాంకుల్లో శతశాతం క్లోరినేషన్ చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబర్ నుంచి జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, ఎస్.డబ్ల్యు.పి.సి. షెడ్లు, గ్రామీణ నీటి సరఫరా, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ సర్వే, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, డ్వామా శాఖలు, బీసీ కార్పొరేషన్ యూనిట్ల మంజూరు, ఉపాధిహామీ, చలివేంద్రాలు ఏర్పాటు అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయత్ రాజ్, గృహ నిర్మాణ శాఖల డీఈలు,జేఈలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలన్నింటిని త్వరతగిన పూర్తిచేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులకు కేటాయించిన పనిదినాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 500 పశువుల నీటి తొట్టెలను మంజూరు చేయడం జరిగిందని, వాటి నిర్మాణాలు పూర్తిచేసి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. గిరి శిఖర గ్రామాలలో మంచినీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, ప్రతిరోజు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఎంపీడీవోలకు సూచించారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించిన గోకులం షెడ్లలను త్వరతగతిన పూర్తి చెయ్యాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సహాయం లబ్ధిదారుల ఖాతాలలో ఇప్పటికే జమచేయడం జరిగిందని, మిగిలిన లబ్ధిదారుల ఖాతాలకు నగదు జామచేసి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 11 జరగబోయే జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని అదే రోజున బీసీ కార్పొరేషన్ ద్వారా 400 యూనిట్లను మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు తగు ఏర్పాట్లు చెయ్యాలని బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణ డైరెక్టర్ పెంటోజీరావును ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి, జడ్పీ సీఈవో నారాయణ మూర్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచిదేవి, డ్వామా పీడీ పూర్ణిమ దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎ.ఎస్ ఎ.రామస్వామి, డీపీఆర్పీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల కార్యనిర్వహణ డైరెక్టర్ పెంటోజీ రావు, ఇతర జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, పంచాయత్ రాజ్ డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం టౌన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్) : -** మున్సిపాలిటీ పరిధిలో గచ్చపు వీధి 26వ వార్డు, పీనారిపాలెం 1వ వార్డు, బీసీ కాలనీ 2వ వార్డు, 28వ వార్డులో 12 అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రతి వార్డులో మహిళలు హారతులతో వీధి వీధికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోని 28వ వార్డులో నేడు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.4.50 కోట్లతో పెద్ద చెరువును హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి, పోలవరంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి స్పష్టంగా కన్పిస్తోందని అన్నారు. చింతకాయల పద్మావతి మాట్లాడుతూ 26వ వార్డు కౌన్సిలర్‌గా గత నాలుగేళ్లలో వీధి లైట్ వేసే స్థితి లేకపోయిందన్నారు. సొంత నిధులతో కొంత అభివృద్ధి చేశామన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు సహకారంతో రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. మిగిలిన అన్ని పనులు మూడు నెలల్లో పూర్తవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ డబ్బీర్ శ్రీకాంత్, ఒకటో వార్డు కౌన్సిలర్ లాలం వరహాలమ్మ, రెండో వార్డు టీడీపీ ఇన్‌చార్జి లాలం మురళీకృష్ణ, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 309 ఖాళీలు




ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఖాళీగా ఉన్న జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మే 24వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు-ఖాళీలు**

జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్): 309

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్)లో ఉత్తీర్ణత ఉండాలి.

**వయోపరిమితి:** 24-05-2025 తేదీ నాటికి 27 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**జీతం:** నెలకు రూ.40,000 - రూ.1,40,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్‌లైన్ ద్వారా.

**దరఖాస్తు ప్రారంభ తేదీ:** 2025 ఏప్రిల్ 25

**దరఖాస్తు చివరి తేదీ:** 2025 మే 24

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్ మెన్‌కు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష ఆధారంగా.

## భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు (మ్యుజీషియన్) ఉద్యోగాలు



భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా.. అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్నివీర్ వాయు (మ్యుజీషియన్) (01/ 2026) ఖాళీల భర్తీకి ఐఏఎఫ్ ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థులు మే 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఖాళీల వివరాలు:**

భారత వాయుసేన- అగ్నివీర్ వాయు (మ్యుజీషియన్) ఇన్‌టేక్ 01/2026

మ్యూజిక్ నైపుణ్యాలు: కన్సర్ట్ ఫ్లూట్/ పికోలో, ఒబో, Eb / Bbలో క్లారినెట్, Eb / Bbలో సాక్సోఫోన్, F /Bbలో ఫ్రెంచ్ హార్న్, Eb /C /Bbలో ట్రంపెట్, Bb/Gలో ట్రోంబోన్, యుఫోనియం, %జుఎ /దీఎ%లో బాస్ / ట్యూబా, కీబోర్డ్ / ఆర్గాన్ / పియానో, గిటార్ (అకౌస్టిక్ / లీడ్ / బాస్), వయోలిన్, వయోలా, స్ట్రింగ్ బాస్, అన్ని భారతీయ శాస్త్రీయ వాయిద్యాల్లోని ఏదైనా ఒక దాంట్లో నైపుణ్యాన్ని కలిగి ఉండాలి.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/ బోర్డు నుంచి మెట్రిక్యూలేషన్/ టెన్త్ ఉత్తీర్ణత లేదా తత్సమాన విద్యార్హత నిర్దిష్ట శారీరక దారుఢ్య/ వైద్య ప్రమాణాలు, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ ఉండాలి. వాయిద్య పరికరం వాయించడంలో ప్రావీణ్యం తప్పనిసరి.

Indian Navy: ఇండియన్ నేవీలో అగ్నివీర్ (ఎంఆర్) పోస్టులు

**ఎత్తు:** పురుషులు 162 సెం.మీ. మహిళా అభ్యర్థులకు 152 కనీస ఎత్తు ఉండాలి.

**వయోపరిమితి:** 01-01-2005 నుంచి 01-07-2008 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

**జీతం:** మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000 మూడో ఏడాది రూ.36,500బీ నాలుగో ఏడాది రూ.40,000.

**ఎంపిక ప్రక్రియ:** మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంగ్లిష్, అడాప్టబిలిటీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.100.

**ముఖ్య తేదీలు..**

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం:** 21-04-2025.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ:** 11-05-2025.

**రిక్రూట్‌మెంట్ ర్యాలీ షెడ్యూల్:** జూన్ 10 నుంచి 18-06-2025 వరకు.

**ర్యాలీ వేదిక:** జూన్ 10 నుంచి 18-06-2025 వరకు.

**ర్యాలీ వేదిక:** 2 ఏఎస్‌సీ సీ/ఓ రేస్ కోర్స్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూ ఢిల్లీ (న్యూఢిల్లీ), 7 ఏఎస్‌సీ, నెం.1 కబ్బన్ రోడ్, బెంగళూరు (కర్ణాటక).

**ముఖ్యాంశాలు:**

భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ (01/2026) విడుదల చేసింది.

అగ్నివీర్ వాయు ఖాళీల భర్తీకి ఐఏఎఫ్ ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

## ఏపీ ఎడ్ సెట్ - 2025 నోటిఫికేషన్ విడుదల

2 సం.ల బీ.యిడీ, , స్పెషల్ బీ.యిడీ కోర్సులలో 2025 - 26 సం.లో ప్రవేశం కోసం నిర్వహించే %ఙూా% ఎడ్ సెట్ నోటిఫికేషన్ విడుదల అయింది.

**ఫీజు వివరాలు:** ఓసీ - 650, బీసీ - 500, ఎస్సీ, ఎస్టీ - 450.

**అప్లికేషన్ ఆన్ లైన్ ప్రారంభం:** 08/04/25 నుంచి

**ఆఖరి గడువు:** 14/05/25

**పరీక్ష తేదీ:** 05/06/25

## ఏడవ పౌష్టికాహార పక్షోత్సవం : ఏప్రిల్ 8 నుండి 22 వరకు



తాళ్లపూడి/ప్రక్కిలంక, (విశాఖ సమాచారమ్):- పి.హెచ్ నందు ఏడవ పౌష్టికాహార పక్షోత్సవం జరిగింది. మొదటి వెయ్యి రోజులు గర్భస దశ నుండి రెండు సంవత్సరాల వరకు సంరక్షణపై శ్రద్ధ వహించుట. లబ్ది దారులు స్వయంగా తమంతట తామే పోషణ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానం పట్ల ప్రచారం చేయాలి.

కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లలలో పోషకాహార లోపం నివారించడం., పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం. ప్రతి అంగన్వాడి కేంద్రంలో వర్కింగ్ డేస్ గా రన్ చేసి జనందోళన అనే డాష్ బోర్డులో అప్లోడ్ చేస్తామని సూపర్వైజర్ వై. భాగ్య కుమారి తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం



తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- మండలంలో మలకపల్లి గ్రామంలో ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.20 కోట్లతో మునిసిపాలిటీ అభివృద్ధి

### కౌన్సిలర్ చింతకాయల పద్మావతి



నర్సీపట్నం (విశాఖ సమాచారమ్) : మునిసిపాలిటీ పరిధిలో రెండో రోజు శంకుస్థాపనలు జోరుగా కొనసాగాయి.ఈ కార్యక్రమంలో స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి శారద నగర్ 16వ వార్డులో రెండు పనులకు రూ.21.02 లక్షలు, బంగారు రాజు 21వ వార్డులో మూడు పనులకు రూ.10.09 లక్షలు, వెంకినాయుడుపేట 22వ వార్డులో ఒక పనికి రూ.7.68 లక్షలు, బొంతు వీధి 23వ వార్డులో మూడు పనులకు రూ.21.52 లక్షలు కేటాయించి, మొత్తం తొమ్మిది పనులకు గాను రూ.60.31 లక్షల విలువైన సీసీ రోడ్లు, సైడ్ కాలువల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పద్మావతిని మహిళలు పూలదండలు, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మునిసిపాలిటీ అభివృద్ధిలో గత 8 నెలల్లో రూ.20 కోట్ల మేర పనులు చేపట్టిన ఘనత స్పీకర్ అయ్యన్నపాత్రుడుకే దక్కుతుందని పద్మావతి తెలిపారు. అనుభవం ఉన్న నాయకుడు ఎలాంటి అభివృద్ధిని సాధించగలడో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం శంకుస్థాపన చేసిన నాలుగు వార్డులకు 8 నెలలలో సుమారు రూ.1.38 కోట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు మంజూరు చేశారని వివరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో తాము ప్రతీ వార్డులో సమస్యలను నోట్స్ చేసి పెట్టుకున్నామని, ఇప్పుడు అవి పరిష్కార దశలోకి వచ్చాయని తెలిపారు.మున్సిపాలిటీని భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం తమ లక్ష్యమని, గత ప్రభుత్వంలా కేవలం శిలాఫలకాలికే పరిమితం కాకుండా, వచ్చే ఐదేళ్లలో పూర్తిస్థాయి అభివృద్ధి అందిస్తామని స్పష్టం చేశారు.గత పాలకులు అభివృద్ధిని విస్మరించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ని విమర్శించడానికే పరిమితమయ్యారని విమర్శించారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్గా గెలిచి నాలుగేళ్ల కాలంలో నర్సీపట్నంలోని ఏ వార్డులోనూ అభివృద్ధి పనులు చేయించలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే నాలుగేళ్లలో మట్టి రోడ్డు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో 16వ వార్డు ఇన్చార్జి నాగేంద్ర రాజు, 21వ వార్డు ఇన్చార్జి జాలమూరి రాజ్కుమార్, 22వ వార్డు కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య, 23వ వార్డు కౌన్సిలర్ నేరెళ్ల చంద్రిక, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నాతవరం, (విశాఖ సమాచారమ్):- నాతవరం మండలంలో ఉపాధి హామీ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తాండవ నీటి సంఘం ప్రెసిడెంట్ అర్చిత వెంకటరమణ అన్నారు. పి. కె.గూడెం గ్రామంలో మంగళవారం ఉపాధి పనులకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన అనంతరం తాండవ నీటి సంఘం ప్రెసిడెంట్ అచ్చిర్తి వెంకట రమణ మాట్లాడారు. కార్యక్రమంలో డి.వెంకటరమణ, రమణమ్మ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## గంజాయి కట్టడికి కఠిన చర్యలు : కలెక్టర్ విజయ కృష్ణన్




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) : గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయికి సంబంధించిన సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 1972 కు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్న భరోసా ఇవ్వాలన్నారు. కమిటీలో గల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, వార్డెన్స్, విద్యార్థులతో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పరిసరప్రాంతాలలో పత్యేక నిఘా పెట్టాలని సూచించారు. గంజాయి వినియోగం, అమ్మకాలు జరిగే సమాచారం వెంటనే తెలియజేయాలన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గంజాయి నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు తనిఖీలు నిర్వహించి రోజువారీగా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తాటిపర్తి, కోనాం, డౌనూరు, భీమవరం. శ్రీరాంపురంలలో శాశ్వత చెక్ పోస్టులు, 38 వాహన తనిఖీ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతర నిఘా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, పటిష్టమైన నిఘా, తనిఖీలతో జిల్లా మీదుగా గంజాయి రవాణా అరికట్టగలిగినట్లు తెలిపారు. రైల్వేల ద్వారా ఎక్కువగా రవాణా జరుగుతున్నదని, ఏజెన్సీ ప్రాంతాలనుండి వచ్చే రైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానితులను తనిఖీచెయ్యాలని తెలిపారు. గంజాయి నిరోధానికి రూపొందించిన నెలరోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మొదటి వారంలో పోలీసు, ఆరోగ్య, సంక్షేమ శాఖల ద్వారా ప్రజల నుండి గంజాయికి సంబంధించిన సమాచారం సేకరించడం జరుగుతుందని, సేకరించిన సమాచారాన్ని రెండవ వారంలో కేటగిరివారీగా క్రోడీకరించుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మూడవవారంలో గంజాయి కార్యకలాపాలపై పత్యేక ఆపరేషన్ల నిర్వహణ, హై రిస్క్ ప్రాంతాలలో సిబ్బంది నిఘా పెంచడం జరుగుతుందని తెలిపారు. నాలుగో వారంలో కమిటీలో గల సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి తీసుకున్న చర్యలపై సమీక్షించుకొని, తదుపరి తీసుకోవలసిన చర్యలపై అభిప్రాయాలు తీసుకొని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్.టి.ఆర్. జిల్లా ఆసుపత్రిలో 15 బెడ్స్‌తో రి-అడిక్షను సెంటరు ఏర్పాటు చేయడం జరిగిందని, దాని ద్వారా మత్తుకు అలవాటు పడిన వారికి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 42 కేసుల్లో 178 నిందితులను గుర్తించడం జరిగిందని, వీరిలో 132 మందిని అరెస్టు చేశామని, ఇద్దరిపై పి.డి.యాక్ట్ నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 3,090 కేజీల గంజాయి, 53 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం 1972 టోల్ ఫ్రీ నంబరుపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించే ప్రచార పోస్టరును విడుదల చేశారు.ఈ సమావేశంలో పోలీస్, సెబ్, ఆర్.టి.సి, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, కోస్ట్ గార్డ్, మెరైన్, జీఆర్పీ, మత్స్య శాఖల అధికారులు,అడిషనల్ ఎస్.పి. ఎం.దేవప్రసాద్, రెవెన్యూ డివిజినల్ అధికారులు వి.వి.రమణ, షేక్ ఆయిషా, ఎన్డీపిసి సెల్ ఇనస్పెక్టరు గఫూర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, డ్రగ్ కంట్రోల్ సహాయ సంచాలకులు ఎస్.విజయ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, జిల్లా ప్రజారవాణాధికారి కె.పద్మావతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలతో సతమతం

### బుడగ జంగాల కాలనీలో డ్రైనేజీ, తాగునీటి ఇక్కట్లు పట్టించుకోని అధికారులు





కె.కోటపాడు (విశాఖ సమాచారమ్): మేజర్ పంచాయతీ పరిధి బుడగ జంగాల కాలనీ వాసులు ఏళ్ల తరబడి డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో సతమతవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన్‌బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు, గీతం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడుతో కలిసి కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో 50 కుటుంబాలకు చెందిన బుడగ జంగాలు తెగకు చెందిన వారు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇక్కడ డ్రైనేజీ సమస్య దుర్భరంగా ఉందన్నారు.శుక్రవారం కురిసిన వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లి ఇంట్లోకి వచ్చిందని తెలిపారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో గతంలో ఓ అమ్మాయి కాలువలో పడి చనిపోయిందని తెలిపారు. దోమలు బెడద ఎక్కువ ఉండడంతో తరుచు మలేరియా, డెంగ్యూ బారిన పడి ఆసుపత్రి పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ పతి పాదికన డ్రైనేజీని బాగు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే మంచి నీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ కింద పైపులైన్ వేసి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. లేని ఎడల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి

### మాడుగుల ఎమ్మెల్యే బండారు



వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్) : జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గ కేంద్రం లో నియోజవర్గ స్థాయిలో సీడప్ డీఆర్‌డీఏ కౌశల్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ సుమారు 13 పెద్ద కంపెనీలలో ప్రవేశాల కోసం ఈ సీడప్ మేళా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల ద్వారా మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి దాని ద్వారా నైపుణ్యాన్ని సంపాదించిన యువతీ యువకులకు పెద్ద కంపెనీల్లో శాశ్వత ఉద్యోగాల కోసం ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ మేళాలో నియోజకవర్గ స్థాయిలో అనేక మంది యువతీ,యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళపురెడ్డి వెంకటరాజారామ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, సీనియర్ నాయకులు పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేవుడు, జాబ్ జిల్లా మేనేజర్ కల్యాణి, డీజీఎం మహంతి, మేనేజర్ కె.లోవ రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ ప్రసాదాల్లో ఆర్గానిక్ ఉత్పత్తులు వినియోగించాలి

### కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- దేవాలయాలలో నైవేద్యం, ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ విధా నంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, విశాఖపట్నం,అనకాపల్లి జిల్లాల దేవాదాయశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. దేవాలయాలలో వినియోగిస్తున్న ఆహార వస్తువుల వివరాలు, వాటి సేకరణ విధానాలు, ప్రస్తుతం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విధానం పండిస్తున్న పంటలు, వాటి లభ్యత వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.దేవాలయాలలో నైవేద్యం, ప్రసాదాలకు కావలసిన సరుకులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేయాలని. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఏ దేవాలయానికి ఏ వ్యవసాయ రైతు సంఘం ద్వారా సరకులు సరఫరా చేయాలనే విషయం మ్యాపింగ్ చేయాలన్నారు. నూరుశాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు మాత్రమే సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని, భవిష్యత్తులో దేవాలయాలకు కావలసిన సరుకులన్నింటిని సరఫరా చేయుటకు వ్యవసాయ అదికారులు ప్రణాళిక సిద్దం చేసుకోవాలని, సాగును పెంచాలని కలెక్టరు తెలిపారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్.లచ్చన్న, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, జిల్లా దేవాదాయశాఖ అధికారి కె.ఎల్. సుధారాణి, ఇతర దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌గా జవ్వాది ప్రమాణ స్వీకారం

వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- మాడుగుల గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా వైసీపీ యువ నాయకుడు జవ్వాది వరహాలు ప్రమాణ స్వీకారం చేశారు. మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సేనాపతి కొండలరావు. జడ్పీటీసీ కిముదు రమణమ్మ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి. వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీను, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి. కుక్కర మహేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నిసా, ఈవో మూర్తి బాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు.

## కుటుంబాలను వదిలేసి సహజీవనం

### భాగస్వామిని హతమార్చిన మహిళ



రవిప్రసాద్ (పాత చిత్రం)

ఖానాపురం హవేలి: ఇద్దరూ వివాహితులే.. కుటుంబాలను వదిలేసి సహజీవనం సాగిస్తున్నారు. జరిగిన గొడవలో ఒకరు ప్రాణం కోల్పోగా.. మరొకరు జైలు జీవితం గడపాల్సిన పరిస్థితి. సహజీవనం మోజులో రెండు కుటుంబాలు బజారున పడిన ఉదంతమిది.. మహిళ తోసేయడంతో తలకు తీవ్రగాయమై వ్యక్తి మృతి చెందిన ఘటన ఖమ్మం నగరం నేతాజీనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఖానాపురం హవేలీ పోలీసుల కథనం మేరకు ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన కొసని రవిప్రసాద్(53) ఖమ్మంలో కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. సత్తుపల్లిలో ఓ బహుళ అంతస్తు నిర్మిస్తున్న సమయంలో ఏలూరు జిల్లా రాఘవపురానికి చెందిన లావణ్యతో పరిచయం ఏర్పడింది. తాను నిర్మిస్తున్న బహుళ భవనానికి లావణ్య భర్తను వాచ్‌మెన్‌గా పెట్టుకున్నాడు. లావణ్యకు ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో ఆమె భర్తను వదిలేసి కూతురు సహా సత్తుపల్లిలో మరో ఇంటిని అద్దెకు తీసుకుని ఉండేది. ఆ ఇంటికి రవిప్రసాద్ వస్తుండేవాడు. రవిప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇరువురు పిల్లల్ని, కుటుంబాలను వదిలి అక్టోబరులో ఖమ్మం నగరంలోని నేతాజీనగర్‌లో సహజీవనం చేస్తున్నారు. భార్యాభర్తలమని ఇంటి యజమానికి చెప్పారు. కొద్దికాలం సంతోషంగా గడిపిన వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి వీరి మధ్య ఘర్షణ జరిగింది. లావణ్య.. ప్రసాద్ బనియన్‌ను మెడకు వేసి లాగి మంచంపై నుంచి నెట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు లావణ్యను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సాయంత్రం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఆనంద డోలికల్లో ముంచెత్తిన నృత్య ప్రదర్శనలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండగ మహోత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా 11వ రోజు మంజుశ్రీ నృత్యాలయ విశాఖపట్నం, శ్రీ లలిత నృత్యాలయ కళ నికేతన్ రాజమహేంద్రవరం వారి చిన్నారులచే కూచిపూడి భరతనాట్యం శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలలో శివ పంచాక్షరి, పలికే బంగారమాయే అదిగో అల్లదిగో అన్నమాచార్య కీర్తన వేదములా ఘోషించే గోదావరి హరి గిరి నందిని సతులారా చూడరే శంభో శివ శంభో వంటి గీతాలకు శాస్త్రీయ నృత్యాలు చేయడంతో పాటు ఘల్లు ఘల్లు గజ్జల సంగీతం, మామ బంగారి మామ జానపద గీతాలకు.చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి విశాఖకు చెందిన మంజుశ్రీ శిక్షణలో దీక్షిత సాయి చేసిన నాగిని నృత్యంతోపాటు పలు శాస్త్రీయ నృత్యాలు, రాజమహేంద్రవరం పట్టణానికి చెందిన ఆరవ ఆంజనేయులు శిక్షణలో గీతాంజలి చేసిన ప్రదర్శనలు ప్రేక్షక ప్రశంసలు పొందాయి. ముఖ్య అతిథులుగా అనకాపల్లి పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ప్రముఖ వైద్యులు విక్రమ్ (సత్యనారాయణ), లైన్స్ క్లబ్ సెక్రటరీ ఎం. రాకేష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



అరకులోయ (విశాఖ సమాచారమ్) : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం బొండం పంచాయతీ కొత్తవలస శాఖ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యితో వంట చేస్తూ ఖాళీ గ్యాస్ బండతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కమిటీ సభ్యుడు గత్తుం బుజ్జి బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై బాదుడు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఒకేసారి రూ.50 గ్యాస్ ధర పెంచి ప్రజల నడ్డివిరిచిందన్నారు. పుండు మీద కారం చల్లిన చందంగా ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్స్ బిగించి ట్రూ అఫ్, సర్దుబాటు, చార్జీల పేరుతో ప్రజాలపై విద్యుత్ ధరలు పెంచి నడ్డి విరుస్తూంటే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లక్షల కోట్లు రూపాయలు మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకం పైన కూడా భారం పడుతుందన్నారు. కాబట్టి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.అప్పన్న టి జోషి, మహిళా సంఘం నాయకులు జి.శాంతి ప్రియ, జి.నీలమ్మ. టి.సుందరమ్మ, జి.పార్వతి, జి.దేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు పూర్తి

## ఎంపీడీవో శ్రీనివాసరావు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):–** వెనుకబడిన తరగతుల (బీసీ రుణాలు) సంక్షేమానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రాయితీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు పూర్తయ్యాయని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంక్‌ల పేరిట దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 41 మంది దరఖాస్తులు చేసుకోగా దాదాపు ఈ ఇంటర్వ్యూలలో వారందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ శరత్ చంద్ర, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ లు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ లు సుమిత్ర, సింహాచలం, నవమోహన్ కుమార్, ఆమనీరాజ, రాజశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో కుక్కలు, దోమల బెడద పరిష్కరించండి

## అధికారులకు ప్రజా సంఘాల వినతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు నివాసంలో సమావేశమై అనకాపల్లిలో నెలకొన్న సమస్యలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక ముఖ్య సలహాదారు విల్లూరి పైడిరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా అయినా అనకాపల్లి పట్టణం గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్నప్పటికీ రోజురోజుకూ అభివృద్ధిలో వెనక పడుతుంది తప్ప ముందుకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పట్టణ ప్రజలను పట్టిపీడిస్తున్న దోమల బాధ, ఏ వీధిలో చూసిన కుక్కల స్వైర్య విహారాలు తాగునీటి సమస్యలు పట్టణ ప్రజలను పట్టి పీడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు మాట్లాడుతూ పట్టణ సమస్యలపై ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన రాజకీయ నాయకులు పట్టణ సమస్యలు పట్టించుకోకుండా సభలు , సన్మానానికి పరిమితం అవుతున్నారని, పట్టణ ప్రజలకు రెండు పూటలా శుద్ధి చేసిన మంచినీరు అందించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిన్ని యాదవ్ మాట్లాడుతూ సమస్యలు చెప్పటానికి అధికారులను కలుద్దామంటే అందరూ ఇన్చార్జిలేనని మున్సిపాలిటీలో కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ హెల్త్ ఆఫీసర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంటి ఫుల్ టైం అధికారులు ఎవరూ అందుబాటులో లేరని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయవలసిన కమిషనరే మూడు నెలల నుంచి లేకపోవడం బాధాకరమని ప్రజా ప్రతినిధులే స్వయానా జీవీఎంసీ అధికారులు మాట వినటం లేదని చెబుతున్నారు అంటే జీవీఎంసీ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఫోరం ఫర్ సోషల్ రైట్స్ జిల్లా అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మంగరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, రైతు సంఘం నాయకుడు ఆడారి బుచ్చి రాము, ఆర్యవైశ్య సంఘ నాయకుడు బొడ్డు సోమరాజు, మత్స్యకారుల సంఘ నాయకుడు వాసుపల్లి తాతయ్యలు, ప్రజాసంఘాల సహాయక కార్యదర్శి కుంచా వారి చిన్ను, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విస్సన్నపేట భూముల బాగోతంపై ఆవేదన



**కసింకోట, (విశాఖ సమాచారమ్):–** మండలం విస్సన్నపేట భూములపై ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జనసేన నాయకులు కోరుబిల్లి పరి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ భూములు బాగోతం అందరికీ తెలిసిందేనని, ఈ భూములపై అధికారం రాకముందు వైసీపీ నాయకులపై అనేక విమర్శలు చేసి, వాళ్ల భూ దందాలు, భూకబ్జాలపై కరపత్రాలు విడుదల చేశారు. గతంలో జనసేన నాయకులు అనేక మార్లు ఈ భూములపై మహా యుద్ధాలు చేశారని, కూటమి ప్రభుత్వం వస్తే భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటారు అనుకున్న వారందరికీ నేడు ప్రభుత్వం వచ్చాక నిరాశగానే మిగిలింది. దీనిపై విసన్నపేట పర్యటించిన పవన్ కళ్యాణ్ 600 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందని, అధికారంలోకి రాగానే ఎవరినీ వదిలిపెట్టమని చెప్పి, ఇప్పుడు అధికారంలోకి వచ్చి నేటికి పది నెలలు అయినప్పటికీ ఎటువంటి చర్యలు కానరాలేదన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై సీబీఐ ఎంక్వయిరీ చేయించవలసిందిగా కోరారు. ఆ భూముల్ని చుట్టుపక్కల నిరుపేద రైతులకి, ప్రభుత్వం నుండి అందించవలసిందిగా పత్రికాముఖంగా కోరుకుంటున్నామని పరి తెలిపారు.

# పీఎస్ పేట స్వాగత ముఖ ద్వారానికి శంకుస్థాపన



**చోడవరం (విశాఖ సమాచారమ్) :** చోడవరం పంచాయతీ శివారు పీఎస్ పేట స్వాగత ముఖ ద్వారానికి చోడవరం ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన చేశారు. దీంతో ఎప్పటినుంచో పీఎస్ పేట ప్రజలు ఆకాంక్ష నెరవేరింది. స్థానిక పెద్దలు, ప్రజలు చందాలు వేసుకొని తొమ్మిది లక్షల యాభై వేల రూపాయలతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ప్రజలు తీసుకున్న నిర్ణయం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, ఎక్స్ ఎంపీపీ పెదబాబు, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు మాస్టారు, ఎంపీటీసీ పుట్రేవు శ్యామ్, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకటరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి లక్ష్మణరావు, కిలపర్తి శ్రీను, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పంచాయతీల సమస్యలపై మంత్రివర్గంలో చర్చించి పరిష్కారానికి అవకాశం ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని తెలిపారు. మంగళవారం అరకులో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన గ్రామాల సర్పంచులు పవన్ కళ్యాణ్‌ను కలిశారు. గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విద్యుత్ బిల్లులపై వడ్డీలు వేసి మరీ పంపుతుండడంతో పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నాయని, మైనర్ పంచాయతీలకు ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరారు. గత కూటమి ప్రభుత్వంలో విద్యుత్ బిల్లులు కట్టాలని సర్పంచులకు నోటీసులు వచ్చేవని, వైసీపీ హయాంలో విద్యుత్ బిల్లుల పేరిట చెప్పాపెట్టకుండా అకౌంట్లు ఖాళీ చేశారని సర్పంచులు వాపోయారు. గిరిజన గూడెం/తాండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి నిధులు మంజూరు చేయాలంటూ అర్జీ సమర్పించారు. గిరిజన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే సాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కోరారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి, మౌలిక వసతుల కల్పనపై చర్చించేందుకు గిరిజన గ్రామాల సర్పంచులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్రం నుంచి రావాల్సిన నిధుల విడుదల అంశంలోనూ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అధ్వర్యంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, గిరిజన గ్రామాలకు చెందిన సర్పంచులు పాంగి సునీత సురేష్, పెట్టెలి సునీత, పెట్టెలి దాసుబాబు తదితరులు పంచాయతీల సమస్యలను మంత్రి పవన్ కళ్యాణ్‌కు వివరించారు.

# లారీల ట్యాంకుల్లో రాత్రికి రాత్రి ఆయిల్ చోరీ



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):–** మండలంలో గజ్జరం గ్రామ సమీపంలోని ఉన్న నయారా బంకులో నిలుపుదల చేసి ఉన్న రెండు ఆయిల్ ట్యాంకర్ల నుండి సుమారు 600 లీటర్లు డీజిల్ ను గుర్తుతెలియని వ్యక్తులు సమయంలో అపహరించుకుపోయారని ట్యాంకుకు ఉన్న మూత రాకపోవడంతో కట్టర్ తో ట్యాంకు కట్ చేసి డీజిల్ ని తీశారని . కిరాయిలు లేక, లారీకి తెచ్చిన రుణాల చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న సమయంలో ఇలా జరగడంతో ఏమి చేయ లేని పరిస్థితుల్లో తమ ఆవేదనను లారీ ఓనర్లు వ్యక్తం చేశారు . ఇది ఇలా ఉంటే ఇటీవల కాలంలో ఇలా చాలా లారీలో ఉన్న డీజిల్ మరియు బ్యాటరీలను దొంగలించినట్లు ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

# అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** గత నెలలో మండలంలోని అదృశ్యమైన వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన మైనర్ బాలిక ఆచూకీని బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది కనిపెట్టి బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన పై గత నెలలోనే కేసు రిజిస్టర్ చేసినట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

# క్వారీ అక్రమ తవ్వకాలు!

## అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):–** అనకాపల్లిలో మైనింగ్ మాఫియా అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. రేయింబవళ్లూ వందల లారీల్లో టన్నుల కొద్దీ ప్రకృతి సంపద తరలిపోతోంది. అధికారుల పర్యవేక్షణ పెద్దగా లేకపోవడమే దీనికి కారణమనే భావన క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతోంది. అధికారుల చర్యలు తీసుకుందామన్నా పాలకుల పెత్తనంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లిలో క్వారీ సంపద ఎక్కువ. నిత్యం జరిగే క్వారీ తవ్వకాల్లో అక్రమాలే ఎక్కువ జరుగుతున్నాయి. గతంలో ఉన్నతాధికారులు పలు క్వారీల నిర్వహకులకు విధించిన జరిమానాలే దీనికి నిదర్శనం. అయితే ఆ జరిమానాలు చెల్లిస్తున్నారా? లేదా ?అనేది వారికే తెలియాలి. బవులవాడ, కుంచంగి, మార్టూరు, మామిడిపాలెం తదితర గ్రామాలను ఆనుకొని వందల ఎకరాల విస్తీర్ణంతో క్వారీ కొండలు ఉన్నాయి. నిత్యం ఇక్కడ భారీ పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌లు జరుగుతూనే ఉంటున్నాయి. సమాంతరంగా ఉన్న క్రష్షర్లతో కాలుష్యం గ్రామాల్లో పెనవేసుకుపోతుంది. అయినా ఎక్కడా ఎవరు నిబంధనలు పాటించిన పాపాన పోలేదు. ఇదంతా ఒకటైతే గతంతో పోలిస్తే ఇప్పుడు మైనింగ్ మాఫియా మరింతగా పెరిగిందనేది ప్రతి ఒక్కరి మాట. ఓ రాజకీయ నాయకుడి పేరును వాడుకుంటూ ఎవరికివారు కొండలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నట్లు ప్రచారం ఉంది.

# 'ఉపాధి' బకాయిలు చెల్లించాలి : సీఐటీయూ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):–** గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు మండలంలో రెండు కోట్ల రూపాయలు ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మండలం రావాడ పంచాయతీ రేఖవానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పని ప్రదేశంలో నిరసన తెలియజేశారు. అనంతరం గని శెట్టి మాట్లాడుతూ రూ 600 రోజుకి వేతనం చెల్లించాలని పే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. చేసిన పనులకు మండలంలో రెండు కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, మంచినీరు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో షకీలా బేగం, అని మునిసా, భారతి, సోమలమ్మ, లక్ష్మి, ఆలీ, మదీనా, రమణి మునిసా తదితరులు పాల్గొన్నారు.

# 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 11వ తేదీ శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్.ఆర్.శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్ నందు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల ఆందోళన

## 13 నెలలు జీతాలు అందక ఇబ్బందులు




**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్) :** మండలంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 3 నుండి 13 నెలలు జీతాలు అందక ఆకలితో అలమటిస్తున్నామని ఎంపీడీవో ఆఫీస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఖాళీ ప్లేట్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మండలంలోని 32 పంచాయతీల నుండి కార్మికులు హాజరై జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌వీనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు 2 నుండి 13 నెలలు జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని బతకాలని నిలదీశారు. అరకొర జీతాలతో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం సకాలంలో జీతాలు కూడా ఇవ్వక పోవడం దుర్మార్గం అన్నారు. విజయరామరాజుపేట 3 నెలలు, తురకలపూడి 13 నెలలు , బుచ్చయ్యపేట 6 నెలలు, రాజాం 13 నెలలు, బంగారుమెట్ట 4 నెలలు ఇలా అన్ని పంచాయతీ ల్లో 3 నుండి 13 నెలలు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు సాంబశివరావు, కార్మికులు ఒలమేరక ఏసు, బెల్లంకి సూకరాజు, బొర్రా అమ్మాజీ, ఈతలపాక శ్రీను, మరియమ్మ, ఎలుసూరి కొండబాబు, జి.ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):–** విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భీమిలిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా.. భీమిలి జోన్ తగరపువలస శ్రీనగర్ కాలనీకి చెందిన యం.శ్రీను (65) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం రాత్రి ఇంటిపై ఆరేసిన బట్టలు తీస్తుండగా విద్యుత్ షాక్ తగిలి క్రింద పడ్డారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో కేజీహెచ్కు తరలించారు. చికిత్స పొందిన కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మొబైల్ ఆధార్ క్యాంపులు ప్రారంభం

**బుచ్చయ్యపేట,(విశాఖ సమాచారమ్):** మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మొబైల్ ఆధార్ క్యాంపు షెడ్యూల్ వివరాలు పెదమదిన సెక్రటేరియట్ పరిధిలో 8 న చింతపాక, 9 వ తేదీ గున్నెంపూడి, 10 న కెపి అగ్రహారం,11 న పెదమదిన, లోపూడి సెక్రటేరియట్ పరిధిలో 8 వ తేదీన వడ్డాది-1, 9 న వడ్డాది- 2, 10 న విజయరామరాజుపేట, 11 న మంగళాపురం, ఆర్.శివరాంపురం సెక్రటేరియట్ పరిధిలో 8 వ తేదీ న రాజాం, 9 న తురకలపూడి, 10 న మల్లాం, 11 న ఆర్.శివరాంపురం, తైపురం సెక్రటేరియట్ పరిధిలో 8 న బుచ్చయ్యపేట, 9 న కందిపూడి, 10న పెదపూడి 11న పి. పి అగ్రహారం గ్రామాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. మొబైల్ ఆధార్ క్యాంపులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

# నీటి తొట్ల నిర్మాణం ప్రారంభం



**చోడవరం (విశాఖ సమాచారమ్) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా పశువుల తాగునీటి తొట్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభించారు. దానిలో భాగంగా చోడవరం మండలం దుడ్డుపాలెం గ్రామంలో నీటి తొట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ప్రారంభోత్సవం చేశారు. వేసవిలో పశు పక్షాదులు నీరు సేవించి సేద తీసుకునే విధంగా తొట్ల నిర్మాణం జరగాలని సూచించారు. కార్యక్రమంలో చోడవరం మండల ఎంపీడీవో ఆంజనేయులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు మచ్చిరాజు, దుడ్డుపాలెం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా సమాచారమ్

# ఆ క్రికెట్ రూల్ మారాలి

## హనుమ విహారి పోస్టు వైరల్



**ఇంటర్నెట్ డెస్క్:** తెలుగు క్రికెటర్ హనుమ విహారి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. క్రికెట్ రూల్స్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనేది ఆ పోస్టు సారాంశం. ఇంతకీ హనుమ విహారి ఏం పోస్టు పెట్టారు? ఎందుకు డిబేట్‌గా మారనుందనేది తెలుసుకుందాం.

వాంఖడే వేదికగా ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ముంబయిపై ఆర్సీబీ 12 పరుగులతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. కోహ్లి (67), రజత్ పటీదార్ (64), జితేశ్ శర్మ (40), దేవదత్ పడిక్కల్ (37) రాణించారు. 150లోపే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ ఇన్నింగ్స్‌ను రజత్‌తో కలిసి జితేశ్ ముందుకుతీసుకెళ్లాడు. కేవలం 19 బంతుల్లోనే 40 పరుగులు చేశాడు. ఆర్సీబీ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌ను ముంబయి బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా వేశాడు. ఈ ఓవర్‌లో జితేశ్ ఐదో బంతికి సిక్స్ కొట్టాడు. ఇక చివరి బంతిని యార్కర్ సంధించాడు. ఎల్బీ కోసం అప్పీలు చేయగా.. అంపైర్ ఔట్ ఇచ్చాడు. ఆ వెంటనే బ్యాటర్లు పరుగు తీశారు. డీఆర్ఎస్ తీసుకోగా.. సమీక్షలో నాటౌట్‌గా తేలింది. అయితే, అప్పటికే బంతి డెడ్‌బాల్‌గా ప్రకటించడంతో.. పరుగు తీసినా దానిని కౌంట్ చేయలేదు. ఇప్పుడు దానిపైనే హనుమ విహారి స్పందించాడు. నాటౌట్ ఇచ్చినప్పుడు అప్ప టికే పరుగు తీస్తే దానిని లెక్కలోకి పరిగణించాలని వ్యాఖ్యానించాడు.

"క్రికెట్‌లో ఓ రూల్‌ను మార్చాల్సిన అవసరం ఉంది. ఆర్సీబీ ఇన్నింగ్స్ చివరి బంతికి జితేశ్ శర్మ ఔట్ ప్రకటించారు. అతడు రివ్యూ తీసుకున్నాడు. అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఆఫ్‌స్టంప్ ఆవల బంతి పడటంతో సమీక్షలో ఔట్ ఇవ్వలేదు. అయితే, ఇక్కడ సమస్య ఏంటంటే.. బ్యాటర్లు తీసిన రన్‌ను కౌంట్ చేయలేదు. ఒకవేళ అంపైర్ నాటౌట్ ఇచ్చి ఉంటే అప్పుడు పరుగును లెక్కలోకి తీసుకొనేవారు. ఇప్పుడీ మ్యాచ్‌లో ప్రభావం చూపించలేదు. అదే రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క బంతికి రెండు పరుగులు అవసరమైనప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురైఉంటే ఏం చేసేవారు. అందుకే, ఈ నిబంధనల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని విహారి పోస్టు పెట్టాడు.

# ప్రవాసాంధ్ర పిల్లలకు తెలుగు మాట్లాడే పోటీలు



తెలుగు మాట్లాడే పోటీలలో విజేతలు



విజేతలు- సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు

తెలుగు నేలమీద పుట్టి పెరుగుతున్న పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రాని ఈ రోజుల్లో ప్రవాసాంధ్రులు ఎంతో ఘనమని నిరూపించుకుంటున్నారు. సిలికానాంధ్ర మనబడి ఆధ్వర్యంలో తెలుగు మాట్లాడే పోటీలను మేరీల్యాండ్ రాజధాని బాల్టిమోర్లో దిగ్విజయంగా నిర్వహించారు. సుమారు 60 మంది పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ పోటీలను 3 బాగాలుగా విభజించారు.

బుడతలు 5-7 ఏళ్ళ పిల్లలు బీ సిసింద్రీలు : 8-11 ఏళ్ళ పిల్లలు , చిరుతలు 12-16 ఏళ్ళ పిల్లలు గా విభజించారు.

పోటీలు కూడా మూడు రంగాలుగా విభజించారు.

పదరంగము, తిరకాటం, ఒనిమా ( ఒక్క నిమిషం తెలుగులో మాట్లాడడం).

5 నుండి 16 ఏళ్ళ పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, కొన్ని క్లిష్టమైన పదాలను కూడా అలవోకగా రాశారు. విజేతలుగా నిలిచిన పిల్లలు, తెలుగులో వారికి ఉన్న ప్రతిభను చూపి పెద్దలను అబ్బుర పరిచారు.

ఒక్కనిమిషం పాటు ఎటువంటి ఆంగ్ల పదాలు దొర్లకుండా పోటాపోటీగా తెలుగులోనే మాట్లాడి ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. తెలుగు వ్యాకరణం, మన సాహితీ సంప్రదాయాలు, తెలుగులో మాట్లాడటం మరియు వ్రాయటంలో చూపిన ఈ పిల్లల ప్రతిభ అమోఘం. "ఈ తెలుగు మాట్లాట పోటీలు పిల్లల భాషా ప్రావీణ్యానికి పదును పెట్టడమే కాకుండా, వారిలో సృజనాత్మక శక్తిని, నాయకత్వపు లక్షణాలను పెంపొందిస్తాయని" తెలుగు మాట్లాట నిర్వాహకుడు చెప్పారు.

ముఖ్య నగరాలలో పోటీలవిజేతలు, వివిధ రాష్ట్రాల విజేతలంతా, అమెరికా మరియు కెనడా దేశాలలు నిర్వహించబోయే అంతర్జాతీయ తెలుగు మాట్లాట పోటీలలో పాల్గొనే అవకాశం ఉంది.

ఈ పోటీలు రూప కర్త జాతీయ స్థాయిలో కిరణ్ పారపూడి కాగా, మేరీల్యాండ్ రాష్ట్రంలో ప్రకాష్ కర్రి, ప్రవీణ్ దేశరాజ్ సమన్వయకర్తలుగా, నాగ ఆకెళ్ళ,రఘోత్తం పిన్నిరెడ్డి, జగదీష్, రమ్య యశోధ మొదలగు వారు విధ్యార్థులను తీర్చిదిద్దడము లో కృషి చేసారు.

ఈ పోటీల విజయానికి గౌడ, మహేష్‌ఐత వంటి మనబడి భాషాసైనికులు, ఎందరో ఉపాధ్యాయులు, కార్యకర్తల కృషికీమూల కారణం.



**చప్ప గాంధీ,**
**విశాఖ సమాచారమ్**
**ప్రత్యేక ప్రతినిధి,**
**మేరీల్యాండ్, యుఎస్ఏ**

# పాకిస్థాన్ సెలక్షన్ కమిటీకి పరిజ్ఞానం లేదు

## - మాజీ క్రికెటర్ బాసిత్ అలీ




**ఇంటర్నెట్ డెస్క్:** అన్ని ఫార్మాట్లలో వరుస వైఫల్యాలతో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. టీ20 వరల్డ్ కప్ 2024 , ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పేలవ ప్రదర్శన చేసింది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లోనూ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసత్ అలీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ మీద నిప్పులు చెరిగాడు. ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కేవలం ఒకే ఒక ఫ్రంట్ లైన్ స్పిన్నర్‌తో ఎలా బరిలోకి దిగారని ప్రశ్నించాడు. అలాగే ప్రస్తుత కోచ్ ఆకిబ్ జావేద్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశాడు.

'సెలక్షన్ కమిటీ రాజీనామా చేయాలి. వారికి టీమ్ కూర్పు తెలియదు. ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇప్పటి వరకు వరుస వైఫల్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. టమాటాలు అమ్ముకునే వారికే మీ కన్నా ఎక్కువ పరిజ్ఞానం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన టీమ్‌లో స్పిన్నర్లను ఎందుకు తీసుకోలేదని చివరికి వారు కూడా ప్రశ్నిస్తున్నారు' అని బాసత్ అలీ చురకలంటించాడు.

ఇదిలా ఉండగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ వరుస ఓటముల నేపథ్యంలో పీసీబీ ఛైర్మన్‌గా తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు వస్తున్న వార్తలను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం ఖండించింది. ఇందులో నిజం లేదని తెలిపింది.

# అరుదైన పుష్పం



హవాయి ద్వీపంలోని రకరకాల పువ్వులలో మౌనా కీ ( ఈ పువ్వు పూర్తి పేరు Mauna Kea silversword) ఒకటి. ఈ పువ్వుని సహనానికి చిహ్నంగానూ పేర్కొంటారు. ఇదొక అరుదైన పువ్వు. అంతరించిపోతున్న ఈ పువ్వు Asteraceae కుటుంబానికి చెందినది. పొద్దుతిరుగుడు పువ్వులు, డైసీలు వంటి ఇతర పువ్వులుకూడా ఈ కుటుంబానికి చెందినవే.

మౌనా కీ మొక్క ఆకులు ఖడ్గాకారంలో కన్పించడంవల్ల ఈ పువ్వుకి ఆ పేరు వచ్చింది. తీవ్రమైన ఎండ, అధిక గాలుల నుండి కాపాడటంలో ఈ మొక్కలు ఎంతగానో ఉపయోగపడ తాయట.

ఈ మొక్క దీర్ఘకాలముంటుంది. పుష్పించే కొమ్మ పొడవుగా పెరుగుతుంది. ఒక్కో కొమ్మ పొడవు ఆరడుగులు ఉంటుంది. పైగా వందలాది చిన్న, ప్రకాశవంతమైన ఎరుపు లేదా నారింజ వర్ణ పువ్వులతో కప్పబడి ఉంటుంది.

ఒక పువ్వు పూయడంతోనే మొక్క వాడిపోవడం ఆరంభమై క్రమంగా చనిపోతుంది. కఠినమైన వాతావరణం లోనూ ఈ మొక్క తట్టుకోగలదు. పాలిచ్చే జంతువులు ఈ మొక్కలను లాగించేస్తుంటాయి.

ఏదేమైనప్పటికీ ప్రత్యేకతను సంతరించుకున్న ఈ పూల మొక్క జాతిని పరిరక్షించడానికి తగు చర్యలు తీసుకోవలసి ఉందని స్థానికుల మాట.

**- యామిజాల జగదీశ్**

# అమెరికాను వీడి వెళ్ళండి

## బైడెన్ హయాంలోని వలసదారులకు ట్రంప్ షాక్



**ఇంటర్నెట్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాన్ని చేపట్టినదగ్గరి నుంచి వలసల విషయంలో దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో జో బైడెన్ హయాంలో తాత్కాలిక నివాస అనుమతులు పొందిన వలసదారులకు ట్రంప్ షాకిచ్చారు. వారు తక్షణమే దేశం వీడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఆదేశాలు ఇచ్చింది.

యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అభివృద్ధి చేసిన సీబీపీ వన్ యాప్ ద్వారా 2023 జనవరి నుంచి 9 లక్షల మంది అమెరికా లోకి ప్రవేశించారు. ఆ యాప్‌లో నమోదు చేసుకున్నవారు అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక అనుమతితో రెండేళ్లపాటు అగ్రదేశంలో ఉండేందుకు అనుమతి ఉంటుంది. "అమెరికా ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు జాతీయ భద్రత కోసం తీసుకునే చర్యల్లో భాగంగా ఈ పెరోల్‌ను రద్దు చేస్తున్నాం" అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ తాజాగా వెల్లడించింది. సీబీపీ యాప్ ద్వారా లబ్ధి పొందిన వారికి తొలగింపు నోటీసులు అందించామని తెలిపింది. అదే యాప్ ద్వారా స్వచ్ఛందంగా స్వీయ బహిష్కరణ చేసుకోవాలని సూచించింది.

అయితే ఎంతమందికి ఆ నోటీసులు వెళ్లాయో మాత్రం తెలియరాలేదు. అమెరికాను వదిలేయాల్సిన సమయం వచ్చిందని హొండురస్ దేశం నుంచి వచ్చిన కుటుంబానికి నోటీసులు అందాయని ఓ వార్తా కథనం వెల్లడించింది. ఆ కుటుంబం గత ఏడాది చివర్లో అమెరికా వచ్చింది. మిగతావారు కూడా ఈ-మెయిల్‌లో తమకు వచ్చిన నోటీసులను సోషల్ మీడియాలో షేర్ చేసి, ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# మన విద్యార్థులకు చేయూతనివ్వండి

## కెనడాలోని తెలుగు సీఈవోలకు యార్లగడ్డ విజ్ఞప్తి






**టొరంటో (కెనడా) :** కెనడాలోని తెలుగు విద్యార్థులు ఉపకార వేతనాలు, ఉద్యోగాల విషయంలో ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వారికి చేయూతనివ్వాలని కెనడాలోని వివిధ సంస్థల తెలుగు సీఈవోలకు విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విజ్ఞప్తి చేశారు. టొరంటో నగరంలోని బంజారా ఇండియా రెస్టారెంట్‌లో పలువురు తెలుగు సీఈవోలతో సమావేశమైన యార్లగడ్డ, ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన తర్వాత అమెరికా-కెనడా, కెనడా-భారత సంబంధాలలో వచ్చిన మార్పుల కారణంగా తెలుగు విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. కెనడాలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని, తెలుగు సంఘాలతో చర్చించి, విద్యార్థులకు ఉపకార వేతనాలు, పార్ట్ టైం ఉద్యోగాలు, అర్హతలున్న వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

గతంలో చదువుకోసం వచ్చిన తెలుగు వారిలో 80 శాతం మంది వర్క్ పర్మిట్ తో ఉద్యోగాలు పొందే వారు ఉండేవారని, అయితే ప్రస్తుతం ఈ సంఖ్య 20 శాతానికి పడి పోయిందని పేర్కొన్నారు. భారత సాంస్కృతిక రాయబారిగా కెనడాలో పనిచేసిన సమయం లో ఆచార్య యార్లగడ్డ ఏర్పరచుకున్న సంబంధాల వల్ల ఈ చర్చలు ఫలవంతంగా సాగాయి.

"నమస్తే కెనడా" పత్రిక అధినేత , ప్రముఖ హిందీ సాహితీవేత్త శరణ్ ఘయ్, తెలుగు ఖతులు (ఫాంట్లు) రూపొందించిన తొలి విదేశాంధ్రులలో ఒకరైన రచయిత శ్రీకృష్ణ దేశికాచార్యులను ఆచార్య యార్లగడ్డ విశ్వ హిందీ పరిషత్ తరఫున సత్కరించారు. విండ్సర్ నగరంలో కెనడాలో అతిపెద్ద టాక్స్ కన్సల్టింగ్ సంస్థలలో ఒకటైన 8 నగరాలలో కార్యాలయాలు కలిగిన లిబర్టీ టాక్స్ కు చెందిన తెలుగు ప్రముఖులు సూర్య బెజవాడ, విశాల్ బెజవాడలను కలిసి అక్కడి తెలుగు విద్యార్థులకు సహాయంగా నిలవాలని కోరారు.

# బ్రావో రికార్డును అధిగమించిన భువీ



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్‌లో భువనేశ్వర్‌కుమార్ ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అత్యధిక వికెట్లు తీసిన ఫాస్ట్‌బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఈ విభాగంలో 183 వికెట్లతో ఇంతకాలం అగ్రస్థానంలో కొనసాగుతున్న బ్రావోను వెనక్కి నెట్టాడు. భువీ ఈ ఫీట్‌ను సోమవారం ఆర్సీబీకి ముంబయి ఇండియన్స్ కు జరిగిన మ్యాచ్‌లో తిలక్‌వర్మ వికెట్‌ను కూల్చడం ద్వారా సాధించాడు. ఇది తనకు ఐపీఎల్‌లో 184వ వికెట్. ఈ ఐపీఎల్ సీజన్‌లో భువనేశ్వర్ కుమార్‌కిది మూడో వికెట్. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఓవరాల్‌గా మాత్రం మూడో స్థానంలో ఉన్నాడు. చాహల్ (206), పీయూష్ చావ్లా (192) మాత్రమే తనకంటే ముందున్నారు.

**ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఫాస్ట్ బౌలర్లు వీరే...**

184- భువనేశ్వర్ కుమార్ (179 ఇన్నింగ్స్)
183- బ్రావో (158 ఇన్నింగ్స్)
170- లసిత్ మలింగా (122 ఇన్నింగ్స్)
165- జస్ప్రీత్ బుమ్రా (134 ఇన్నింగ్స్)
144- ఉమేష్ యాదవ్ (147 ఇన్నింగ్స్)

'భువనేశ్వర్ కుమార్ నుంచి మనం చాలా నేర్చుకోవచ్చు. అతడు తలవంచుకొని తన టీమ్‌కు తననుంచి ఏం కావాలో అది చేసుకుంటూ వెళ్లిపోతాడు. కానీ అతడికి దక్కాల్సినంత కీర్తిప్రతిష్ఠలు మాత్రం దక్కలేదు' అని మాజీ క్రికెటర్ శ్రీవత్స్ గోస్వామి అన్నాడు.

# చలివేంద్రం ప్రారంభం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శీలా నగర్ వెంకటేశ్వర కాలనీలో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర చలివేంద్రం ప్రారంభించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ చలివేంద్రంలో తొలి రోజు మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గాజువాక నియోజవర్గంలో ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావుకు రాష్ట్రం మొత్తం మీద అత్యధిక మెజార్టీ వచ్చిందని అందులో గాజువాకలో ఉన్న గవరల పాత్ర కూడా కీలకమని అన్నారు. గవర జాతీయులు అందరూ రాష్ట్రంలో అత్యధిక శాతం కూటమి ప్రభుత్వానికి మద్దతూ పలికారని గవర జాతీయులను రాజకీయంగా గుర్తించిన ఏకైక వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. కార్యక్రమంలో గవర సంఘం నాయకులు, కేంద్ర గౌరీ సంఘం కార్యదర్శి బుద్ధ లక్ష్మప్పారావు, ఆళ్ల రామప్రసాద్, పెంటకోట ఉమామహేశ్వరరావు, కాండ్రేకుల వెంకటేశ్వరరావు, మద్దాల శ్రీనివాసరావు, మళ్ళ నగేష్ కుమార్, యల్లపు శేషుబాబు, దొడ్డి సూరిబాబు, చరగడం రామచంద్రరావు, దాడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.